E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 20-05-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక:137|| పేజీలు–6
www.ekaburu.com

తెలంగాణ నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

03



ఎండ వేడి.. వడగాలుల దాడి

- పెరిగిన ఉష్ణోగ్రతలతో రాష్ట్రం ఉక్కిరిబిక్కిరి
- వేడిగాలులతో అల్లాడుతున్న ఉత్తర తెలంగాణ
- నీరు, మజ్జిగ ఎక్కువగా తాగాలంటున్న నిపుణులు

02

ముంచుకొస్తున్న ఆర్థిక తుపాను: రాహుల్

ఈ-కబురు :రాయ్‌బరేలీ: ఆర్థిక తుపాను దేశం వైపు ముంచుకొస్తోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ తాను పిలుపునిచ్చిన పొదుపు చర్యలను తానే పాటించడం లేదని వ్యాఖ్యానించారు.

03

పాలమూరు రంగారెడ్డికి ప్రాధాన్యం

వేగంగా భూ సేకరణ పూర్తిచేయండి

నిధుల విడుదలలో జాప్యం ఉండదు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఈకబురు,హైదరాబాద్:
పాలమూరు రంగారెడ్డి సాగునీటి ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచించారు. ఉమ్మడి జిల్లాల్లోని ఇతర ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణనూ యుద్ధప్రాతిపదికన పూర్తిచేయించాలని ఆదేశించారు. ఈ జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలతో సీఎం మంగళవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆయా ప్రాజెక్టులపై సమీక్షించారు. భూ సేకరణకు నిధుల విడుదలలో జాప్యం జరగకుండా చూస్తామని హామీఇచ్చారు. ఇతర ప్రాజెక్టుల పెండింగ్ బిల్లులనూ చెల్లిస్తామని స్పష్టంచేశారు. సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మంత్రులను ఆదేశించారు.

మిగతా2లో

నోట్ల కట్టలు... నగల గుట్టలు

- జలమండలి జీఎం కుమార్ ఇంట్లో భారీ సంపద
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ సోదాలు
- రూ.1.10 కోట్ల నగదు స్వాధీనం
- 2 కిలోల బంగారు, 9 కిలోల వెండి ఆభరణాలు...
- ఖరీదైన ఇళ్ల స్థలాలు, భూముల దస్తావేజులు లభ్యం
- అన్నింటి విలువ రూ.5.88 కోట్లుగా గుర్తింపు
- బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా

ఈ-కబురు, నాచారం: చూస్తేనే గుండెలదిరే స్థాయిలో రూ.500 నోట్ల కట్టలు... కిలోల కొద్దీ వెండి, బంగారు ఆభరణాలు... ఎకరాల్లో వ్యవసాయ భూములు... విలువైన ఫ్లాట్లు, స్థలాల దస్తావేజులు... ఇవన్నీ ఒక ప్రభుత్వ అధికారికి చెందిన ఆస్తులంటే నివ్వెరపోవాల్సిందే.

02



వీధి కుక్కల్ని తరలించాల్సిందే!

02

సంబంధాలు ఉన్నతస్థాయికి

భారత్, నార్డిక్ దేశాల మధ్య గ్రీన్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ వ్యూహాత్మక భాగస్వామ్యం

మూడో ఇండియా–నార్డిక్ సదస్సులో నిర్ణయం

02

తీరం మనదే.. మత్స్య సంపదా మనదే

మన జలాల్లో గస్తీ పెంచి మత్స్యకారుల హక్కులు కాపాడతాం

చేపల వేటకు సబ్సిడీపై 200 మెకనైజ్డ్ బోట్లు

సీవీడ్ సాగుతో మత్స్యకార మహిళలకూ ఉపాధి అవకాశాలు

నీటి వనరుల్లో చేపల సాగు చేసుకునే అధికారం మత్స్యకారులదే

మత్స్యకారుల సేవలో భాగంగా రూ.262 కోట్లను పంపిణీ చేసిన సీఎం

ప్రజా ప్రభుత్వానిది సంక్షేమం గొడ్డలి పార్టీది ఫేక్ ప్రచారం

నెల్లూరు జిల్లా కావలిలో మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈ-కబురు,,నెల్లూరు/కావలి, మే 19:
తీర ప్రాంత అభివృద్ధిలో మత్స్య కారులకు భాగస్వామ్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మత్స్య కారుల సంక్షేమానికి.. వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని సీఎం వెల్లడించారు. కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని అలాంటి వారు చేసే ఫేక్ ప్రచారాలను పట్టించు కోవద్దని స్పష్టం చేశారు. నెల్లూరు కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామంలో మంగళవారం మత్స్య కారుల సేవలో కార్యక్రమంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. వేట నిషేధ సమయంలో 1,30,796 మంది మత్స్య కార కుటుంబాలకు రూ. 261.50 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించారు. మత్స్య కారుల సేవలో కార్యక్రమంతో మత్స్య కారుల కుటుంబానికి రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. సీఎం ప్రసంగిస్తున్న సమయంలోనే మత్స్య కారుల సేవలో లబ్దిదారుల ఖాతాల్లోకి నిధులు జమ అయ్యాయి.

మిగతా3లో

ఆర్థిక ఇబ్బందులు... ల్యాప్ టాప్ చోరీ ఆరోపణతో మనస్థాపం...

03

ఒప్పందం కుదరకుంటే విరుచుకుపడతాం

ఈ-కబురు :వాషింగ్టన్:
పశ్చిమాసియా యుద్ధానికి సంబంధించి తాజాగా తీవ్ర ఉత్కంఠ పరిణామాలు చకచకా చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం తెరవెనక సాగుతున్న చర్చల్లో ఒప్పందం కుదరకుంటే... 23 రోజుల్లోనే.. లేదంటే వచ్చే వారం ఆరంభంలో తాము ఇరాన్‌పై దాడులతో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ''ఇరాన్‌తో భారీ స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. అవి సఫలమై.. మా దాడి ప్రణాళిక శాశ్వతంగా అటకెక్కుతుందని ఆశిస్తున్నా. టెహ్రాన్ చేతికి అణ్వాయుధాలు దక్కకుండా ఉండే ఒప్పందం మాకు ఆమోదయోగ్యమవుతుంది'' అని శ్వేతసౌధంలో విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై భారీ స్థాయిలో వెంటనే దాడులు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని తమ అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మంగళవారమే భారీ స్థాయిలో దాడులు జరపాలనుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే అరబ్ దేశాల నేతల విజ్ఞప్తి మేరకు చివరి నిమిషాల్లో ఆ ప్రణాళికను తాత్కాలికంగా పక్కనపెట్టానన్నారు. టెహ్రాన్‌తో చర్చలు సీరియస్‌గా సాగుతున్నాయని, అందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదిరే అవకాశాలు ఉండటం వల్లే దాడుల నిర్ణయాన్ని ప్రస్తుతానికి ఉపసంహరించుకున్నామని తెలిపారు.

03

వైభవ్ వీరకొట్టుడు

చిన్నోడు మళ్లీ చితక్కొట్టేశాడు. నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. సిక్స్‌లు, ఫోర్ల మోతతో వైభవ్ పెను విధ్వంసం సృష్టించిన వేళ.. రాజస్థాన్ మళ్లీ గాడినపడింది.

06

ధరలపై ఇంధన భారమెంత?

- ఇంటి బడ్జెట్‌పై ప్రభావం తప్పదు
- రెపో రేటును ఆర్‌బీఐ మార్చకపోవచ్చు

ఈ-కబురు : పశ్చిమాసియా సంక్షోభంలో రేగిన ఇంధన మంట సెగ మనందరినీ తాకుతోంది. ముడిచమురు ధర 50% పైగా పెరిగినా, పెట్రో ఉత్పత్తుల రిటెయిల్ ధరలను ఇటీవలి వరకు సవరించనందున.. ఈ ప్రభావం కాస్త తక్కువగా కనిపిస్తోంది.

మిగతా2

ఎండ వేడి.. వడగాలుల దాడి



ఈకబురు హైదరాబాద్: తీవ్రమైన ఎండలతో రాష్ట్రం అల్లాడుతోంది. గాలిలో తేమశాతం పడిపోగా ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా అధికంగా నమోదుకావడంతో ఎండ వేడిని జనం తట్టుకోలేకపోతున్నారు. గతేడాది మే 19న రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత 41.9 డిగ్రీలు కాగా మంగళవారం 45.9 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లో 45 డిగ్రీలపైన నమోదయ్యాయి. దీనికితోడు కొద్దిరోజులుగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాలులు వీస్తున్నాయి. నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, జగిత్యాల, ఆదిలాబాద్, సిద్దిపేట జిల్లాల్లోని 19 మండలాల్లో వడగాలులు నమోదు కాగా సిద్దిపేట జిల్లా ములుగులో తీవ్రమైన వడగాలులు వీచాయి. గతేడాదితో పోల్చితే రాష్ట్రంలో నాలుగు డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి.

తేమ తగ్గడంతో అధికవేడి

గాలిలో తేమశాతం తగ్గిపోవడంతో వేడి అధికంగా ఉంటోంది. రాష్ట్రవ్యాప్తంగా 50 శాతంలోపే గాలిలో తేమ ఉంటోంది. రాత్రిళ్లు చల్లని గాలులు వీయడం లేదు. తేమ తగ్గడం మూలంగా ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. హైదరాబాద్ మహానగరం పరిధిలో కాలుష్యం అధికంగా ఉన్నప్రాంతాల్లో వేడి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఎండ తాకిడి తీవ్రంగా ఉంటోంది. ఆరుబయట పనిచేసే కార్మికులపై ఈ ప్రభావం అధికంగా పడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో నమోదైన వడదెబ్బ కేసుల్లో మధ్యతరగతి, కార్మికులే ఎక్కువగా ఉన్నారు. ప్రయాణం చేసేవారు, రేకులషెడ్లు, మైదాన ప్రాంతాల్లో నివసించేవారు వడదెబ్బకు లోనయ్యే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ఎండబారి నుంచి తప్పించుకోవడానికి విపత్తుల నిర్వహణ, వాతావరణ శాఖలు పలు సూచనలు జారీచేశాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

మధ్యాహ్నం 123 గంటల మధ్య ఆరుబయటకు వెళ్లకుండా ఉండాలి.
మధ్యాహ్నం సమయంలో అధికంగా శారీరకశ్రమ చేయొద్దు.
టీ, కాఫీ, ఆల్కహాల్‌తో పాటు కార్బొనేటెడ్ ద్రావణాలకు దూరంగా ఉండాలి.
వేపుళ్లు, ఉప్పు, కారం ఎక్కువుండే వంటకాలు తీసుకోవద్దు.
దాహం వేయకున్నా తగినంత నీరు తాగాలి. మజ్జిగ, చలువ చేసే ద్రావణాలు మేలు.
గాలి ఆడని ప్రాంతాల్లో చిన్నపిల్లలు, పెంపుడు జంతువులను వదలవద్దు.
తలుపులు వేసిఉన్న కార్ల విషయంలో జాగ్రత్త వహించాలి.
వడదెబ్బకు గురైన వ్యక్తిని చల్లని వస్త్రంతో తుడిచి ఆస్పత్రికి తరలించాలి.

వీధి కుక్కల్ని తరలించాల్సిందే!

ఈకబురు దిల్లీ: గౌరవప్రదంగా జీవించే హక్కులో...కుక్క కాటు భయంలేకుండా స్వేచ్ఛగా సంచరించే హక్కు కూడా ఇమిడి ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. అదృష్టం మీద ఆధారపడి పిల్లలు, వృద్ధులు బతకాల్సిన సమాజాన్ని రాజ్యాంగం ఊహించలేదని తెలిపింది. జనసంచార ప్రదేశాల నుంచి వీధి కుక్కలను తరలించి, వాటికి సంతాన నిరోధక చికిత్సలు చేయాలన్న గత ఏడాది నవంబరు 7వ తేదీనాటి ఉత్తర్వుల్లో మార్పులు చేయబోమనీ తేల్చి చెప్పింది. ఆ ఉత్తర్వులు మార్చాలంటూ దాఖలైన పలు పిటిషన్లను తోసిపుచ్చుతూ జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజారియా ధర్మాసనం మంగళవారం పలు వ్యాఖ్యలు చేసింది. తమ ఆదేశాల అమలులో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై మండిపడింది. 'చిన్న పిల్లలు, విదేశీ పర్యాటకులు, వృద్ధులు, మహిళలు ఎందరో కుక్క కాటు బాధితులుగా మారిన ఘటనలను ధర్మాసనం విస్మరించదు' అని స్పష్టం చేసింది. వీధి శునకాల బెడదను రూపుమాపటానికి అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు, వివిధ సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది.

ప్రతి జిల్లాలో ఏబీసీ కేంద్రం...

భారత జంతు సంక్షేమ బోర్డు(ఏడబ్ల్యూబీఐ) మార్గదర్శక నిబంధనలను దేశంలోని అన్ని రాష్ట్రాలు కచ్చితంగా అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రతి జిల్లాలో కనీసం ఒక పూర్తిస్థాయి జంతు జనన నియంత్రణ (ఏబీసీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. జాతీయ రహదారులపై సంచరించే పశువుల సమస్యను కాలపరిమితిలోగా పరిష్కరించాలని తెలిపింది. పర్యవేక్షణ, సమన్వయ వ్యవస్థనూ ఏర్పాటు చేయాలని సూచించింది.

హైకోర్టుల సుమోటో విచారణ

వీధి కుక్కల నిర్వహణ సమస్యను ఇకపై దేశవ్యాప్తంగా ఉన్న సంబంధిత హైకోర్టులు పర్యవేక్షించాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. తమ ఉత్తర్వులు అమలు జరిగేలా చూసేందుకు అన్ని హైకోర్టులు సుమోటోగా విచారణ చేపట్టాలని పేర్కొంది. చర్యా నివేదికలను సమర్పించాలని రాష్ట్రాలకు గడువు నిర్దేశించింది.

తొలిసారి కారుణ్య మరణం

విపరీత ప్రవర్తన, రేబిస్ సోకడం, చికిత్సలకు వీల్లేని వ్యాధులకు గురైన శునకాలకు కారుణ్య మరణాలను సుప్రీంకోర్టు ధర్మాసనం అనుమతించింది. ఈ తరహా ఉత్తర్వులివ్వడం ఇదే తొలిసారి. వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో, ప్రజలు తరచూ కుక్క కాటుకు, దాడులకు గురవుతున్న చోట్ల కారుణ్య మరణాలను స్థానిక సంస్థల అధికారులు అమలుచేయాలని సూచించింది. పశువైద్య నిపుణులను సంప్రదించి, జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టంలోని నిబంధనలు పాటిస్తూ దీనిని అమలు చేయాలని పేర్కొంది. గత ఆరునెలల్లో తన ఆదేశాలు ఎందుకు అమలుకాలేదో తెలుసుకునేందుకు సుప్రీంకోర్టు ప్రయత్నించలేదని పర్యావరణ, జంతు హక్కుల ఉద్యమకారిణి మేనకా గాంధీ విమర్శించారు. న్యాయస్థానం ఆదేశాలు ఆచరణ సాధ్యం కానివని తెలిపారు..

నోట్ల కట్టలు...నగల గుట్టలు

ఈకబురు, నాచారం: చూస్తేనే గుండెలదిరే స్థాయిలో రూ.500 నోట్ల కట్టలు... కిలోల కొద్దీ వెండి, బంగారు ఆభరణాలు... ఎకరాల్లో వ్యవసాయ భూములు... విలువైన ఫ్లాట్లు, స్థలాల దస్తావేజులు... ఇవన్నీ ఒక ప్రభుత్వ అధికారికి చెందిన ఆస్తులంటే నివ్వెరపోవాల్సిందే. అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు జలమండలిలో జీఎం హోదా కలిగిన అధికారి ఇంట్లో సోదాలు చేయగా అతడి అవినీతి విశ్వరూపం బహిర్గతమైంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో... హైదరాబాద్ జలమండలిలో ప్రాజెక్టు డివిజన్3 జీఎం(ఇంజినీరింగ్)గా పనిచేస్తున్న సగ్గం అనంత లక్ష్మి కుమార్(58) ఏసీబీకి చిక్కారు. మంగళవారం తెల్లవారుజామున ఆరు గంటల సమయంలో ఏసీబీ హైదరాబాద్ సీఐయూ విభాగం డీఎస్పీ మాజిద్‌ఖాన్ ఆధ్వర్యంలో అధికారుల బృందం మల్లాపూర్ వెంకటరమణ కాలనీలోని కుమార్ ఇంటికి చేరుకొని సోదాలు నిర్వహించింది. హైదరాబాద్, సికింద్రాబాద్‌లతోపాటు నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని కుమార్ బంధువులు, స్నేహితులకు చెందిన 8 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో అతడి ఇంట్లో రూ.500 నోట్లు భారీగా కనుగొనడంతో లెక్కింపు యంత్రాన్ని తీసుకురావాల్సి వచ్చింది. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం మొత్తం ఆస్తుల విలువను రూ.5.88 కోట్లుగా గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.100 కోట్లకుపైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండలం చేర్యాల, మరికొన్ని గ్రామాలతోపాటు నిజామాబాద్‌జిల్లా నవీపేటలో కుమార్, అతడి బినామీల పేరిట ఉన్న వ్యవసాయ భూములను ఏసీబీ గుర్తించింది. అధికారుల బృందాలు మంగళవారం ఆయా ప్రాంతాల్లో వివరాలను సేకరించాయి. హైదరాబాద్ శివారు చేర్యాల ప్రాంతంలో ఉన్న భూముల విలువ భారీగా ఉన్నట్లు తెలుస్తోంది. నవీపేటలో మూడున్నర ఎకరాల భూమితోపాటు 400 చదరపు గజాల్లో కొబ్బరితోటతో కూడిన ఫామ్‌హౌస్‌ను గుర్తించారు.

కుమార్ ఇంట్లో ఇటీవల జరిగిన వివాహంపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. పెళ్లిలో పెద్దఎత్తున డబ్బు ఖర్చు చేసినట్లు గుర్తించారు. వీడియోల ఆధారంగా ఆ వ్యయాన్ని అంచనా వేయడంలో నిమగ్నమయ్యారు. శుభకార్యాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించిన తర్వాత కూడా... రూ.కోటికిపైగా నగదు ఇంట్లో ఉండటం అధికారుల్ని ఆశ్చర్యపరిచింది.

కుమార్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యుల పేరిట బ్యాంకు లాకర్లు ఉన్నట్లు గుర్తించిన అధికారులు... అతడి భార్య సహా ముగ్గురు కుటుంబ సభ్యులను బ్యాంకు వద్దకు తీసుకెళ్లారు. వారితోనే లాకర్లను తెరిపించారు. వాటిలో బంగారు నగలతోపాటు కొన్ని దస్తావేజులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. సోదాల అనంతరం ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కుమార్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు.

గుర్తించిన ఆస్తుల జాబితా ఇలా...

కుమార్ ఇంట్లో రూ.1.10 కోట్ల నగదు
2.1 కిలోల బంగారు ఆభరణాలు
9.2 కిలోల వెండి వస్తువులు, నగలు
సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో 18 ఎకరాల భూమి
హైదరాబాద్‌లో 6 ఇళ్ల స్థలాలు. ఒక ఖరీదైన ఇల్లు
జీహెచ్ఎంసీ శివారు గేటెడ్ కమ్యూనిటీలో 3 ఫ్లాట్లు
మారుతి రిట్జ్ కారు, బజాజ్ మోటార్ బైక్

పాలమూరు-రంగారెడ్డికి ప్రాధాన్యం

గ్రీన్ ఛానల్ ద్వారా నిధులివ్వాలి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి రూ.480 కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయని మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఈ నిధులను నేరుగా (గ్రీన్‌ఛానల్ ద్వారా) ఇవ్వాలని ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయగా. సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ప్రధాన కాలువల పనులు చేపట్టాల్సి ఉందని పేర్కొనగా... అందుకు అవసరమైన భూసేకరణ, నిధులపై ప్రతిపాదనలు ఇవ్వాలని సీఎం సూచించారు. ఈ అంశంపై ఈ నెల 25న నాగర్‌కర్నూల్, 26న మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులు సమావేశం కావాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ ఎత్తిపోతల్లో చేపట్టకుండా పక్కనపెట్టిన లక్ష్మీదేవిపల్లి జలాశయాన్ని నిర్మించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య కోరినట్లు తెలిసింది. కర్వెన జలాశయం కింద ప్రధాన కాలువను నిర్మిస్తే కోయిల్‌సాగర్ వరకు సాగునీరు అందుతుందని, దీని కిందనే ఎక్కువ ఆయకట్టు ఉందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కోరినట్లు తెలిసింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు రూ.200 కోట్లు కేటాయిస్తే అసంపూర్తి పనులన్నీ పూర్తవుతాయని, అలానే శంకరసముద్రం జలాశయం ఆర్‌అండ్‌ఆర్ పనులు పూర్తిచేయాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతల పథకంలో మరో 10 శాతం భూసేకరణ చేయాల్సి ఉందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. కల్వకుర్తి ఎత్తిపోతల్లోని మొదటి దశ పంప్‌హౌస్‌లో మూడు మోటార్లే నడుస్తున్నాయని, మరో రెండింటిని వినియోగంలోకి తీసుకురావాల్సి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. 2028 డిసెంబరు నాటికి 'పాలమూరురంగారెడ్డి' పూర్తయ్యేలా ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ భేటీలో ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, వి.శంకరయ్య, కృష్ణమోహన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

పాలమూరుకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతాం

ఉత్తమ్ భారాస పదేళ్ల పాలనలో పాలమూరు జిల్లాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అక్కడి ప్రాజెక్టుల్లో పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై పక్షం రోజుల్లో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలతో కలిసి ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల్లో పురోగతిపై రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్ హాజరయ్యారు. పాలమూరురంగారెడ్డి పనులు 90 శాతం పూర్తయ్యాయంటూ భారాస నేతలు చేస్తున్న ప్రచారం పూర్తిగా సత్యదూరం. వారి పాలనలో ఈ ప్రాజెక్టుకు నీళ్లను తీసుకునే ప్రాంతాన్ని జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి మార్చడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. భూసేకరణ జరపకుండానే పిల్ల కాలువల వ్యవస్థ నిర్మాణానికి టెండర్లు పిలిచి నాడు చేతులు దులుపుకొన్నారు. ఈ పథకాన్ని ప్రాధాన్యక్రమంలో పూర్తిచేస్తాం. మొదట ఆరు జిల్లాల్లోని 1226 గ్రామాలకు తాగునీరు అందిస్తాం. పూడికతో నిండి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిన జూరాల జలాశయాన్ని పునరుద్ధరిస్తాం. సంబంధిత ప్రతిపాదనలను కేంద్రానికి పంపాం. చెరువుల్లో వానాకాలానికి ముందే పూడికతీస్తాం'' అని వివరించారు.

సంబంధాలు ఉన్నతస్థాయికి

ఈకబురు, ఓస్లో: తమ సంబంధాలను ఇకపై గ్రీన్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలని భారత్, నార్డిక్ దేశాలు నిర్ణయించుకున్నాయి. భారత ప్రధాని మోదీ మంగళవారం నార్వే రాజధాని ఓస్లోలో మూడో ఇండియా-నార్డిక్ సదస్సులో పాల్గొన్నారు. క్లీన్ ఎనర్జీ, సుస్థిరాభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, నవీన సాంకేతిక పరిజ్ఞానంతోపాటు కీలక రంగాల్లో పరస్పర సహకారంపై విస్తృతంగా చర్చించారు. మోదీతోపాటు ఐస్‌లాండ్ ప్రధాని క్రిస్టన్ ఫ్రొస్టాడాటిర్, ఫిన్‌లాండ్ ప్రధాని పెటెరీ ఓర్పో, డెన్మార్క్ ప్రధాని మెటే ఫ్రెడరిక్సన్, నార్వే ప్రధాని జోనాస్ గర్ స్టోర్, స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టర్‌సన్ ఈ సదస్సుకు హాజరయ్యారు.

అనంతరం ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఉగ్రవాదంపై భారతదేశం, నార్డిక్ దేశాలు స్పష్టమైన, ఐక్య వైఖరిని కలిగి ఉన్నాయని మోదీ తేల్చిచెప్పారు. ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో రాజీపడి ప్రసక్తే లేదని, ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని స్పష్టంచేశారు. ప్రపంచంలో ఉద్రిక్తతలు, సంఘర్షణలు కొనసాగుతున్న తరుణంలో నియమాల ఆధారిత ప్రపంచ క్రమాన్ని బలోపేతం చేయడానికి భారత్, నార్డిక్ దేశాలు కలిసి పని చేస్తూనే ఉంటాయని వెల్లడించారు. ఉక్రెయిన్ అయినా, పశ్చిమాసియా అయినా వివాదాల ప్రారంభ పరిష్కారానికి, శాంతి కోసం జరిగే ప్రయత్నాలకు మద్దతునిస్తూనే ఉంటామని పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన పట్ల నిబద్ధత తమను సహజ భాగస్వాములను చేస్తోందన్నారు. గ్రీన్ టెక్నాలజీ భాగస్వామ్యంతో మొత్తం ప్రపంచానికి మంచి భవిష్యత్తును అందిస్తామని మోదీ పేర్కొన్నారు.

మూడు దేశాల ప్రధానులతో భేటీ

ఐస్‌లాండ్, ఫిన్‌లాండ్, డెన్మార్క్ దేశాలతో క్లీన్ ఎనర్జీ, వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, సుస్థిరాభివృద్ధి, డిజిటలీకరణ, కృత్రిమ మేధ(ఏఐ), క్వాంటమ్ టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సంబంధాలను బలపేతం చేసుకోవడంపై మోదీ చర్చించారు. ఆయన మంగళవారం ఆయా దేశాల ప్రధానమంత్రులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. భారత్, మూడు నార్డిక్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతిపై చర్చించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్‌లో పర్యటించాలని మూడుదేశాల ప్రధానులను మోదీ ఆహ్వానించారు. ఐస్‌లాండ్, ఫిన్‌లాండ్, డెన్మార్క్ దేశాలతో సంబంధాలకు భారత్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మోదీ ఉద్ఘాటించారు.



ఇటలీకి పయనమైన మోదీ

ప్రధాని మోదీ నార్వే పర్యటన పూర్తిచేసుకొని మంగళవారం ఇటలీకి పయనమయ్యారు. నార్వే పర్యటన ఫలవంతంగా ముగిసిందని ఆయన 'ఎక్స్'లో పోస్టుచేశారు. పలు సమావేశాల్లో పాల్గొన్నానని, కీలక రంగాల్లో సహకారాన్ని మరింతగా పెంపొందించడానికి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నామని వివరించారు.

ధరలపై ఇంధన భారమెంత?

ఈ ప్రభావం కాస్త తక్కువగా కనిపిస్తోంది. అయితే చమురు సంబంధిత ఉత్పత్తుల రవాణాకు ఏర్పడుతున్న అంతరాయాలు, బల్క్ డీజిల్ ధరను ముందే సవరించడం వల్ల కంపెనీలపై ప్రభావం పడింది. ఫలితంగా ఏప్రిల్ లోనే టోకు ధరలు అధికంగా పెరిగాయి. ఇప్పుడు వారం వ్యవధిలోనే పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను లీటరుకు రూ.4 చొప్పున పెంచడం వల్ల.. నిత్య జీవితంపై ప్రభావం అధికంగా కనపడనుంది. వివిధ అంచనాల ప్రకారం ద్రవ్యోల్బణం 20 బేసిస్ పాయింట్ల మేర పెరగొచ్చు.

రిటెయిల్ ద్రవ్యోల్బణంపై ఆహారం, గృహ వసతి, రవాణా, ఆరోగ్య సంరక్షణ, విద్య సహా నిత్యావసర వస్తువులు, సేవల కోసం వినియోగదారులు చెల్లించే ధరల్లోని మార్పును సీపీఐ (వినియోగదారు ధరల ఆధారిత సూచీరిటెయిల్) ద్రవ్యోల్బణం కొలుస్తుంది. వడ్డీరేట్ల నిర్ణయానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) దీనినే ప్రామాణికంగా తీసుకుంటుంది.

టోకు ద్రవ్యోల్బణంపైవస్తువులు వినియోగదారులకు చేరక ముందు, ఉత్పత్తిదారుల స్థాయిలో ధరల కదలికలను డబ్ల్యూపీఐ (టోకు ధరల ఆధారిత సూచీ టోకు) ద్రవ్యోల్బణం పర్యవేక్షిస్తుంది. ఇంధనం, ముడి పదార్థాలు, లోహాలు, రసాయనాలు, తయారీ ఉత్పత్తుల ధరల్లోని మార్పులను ఇది సూచిస్తుంది. ఉత్పత్తిదారులకు ఖర్చులు పెరిగితే, వాటిని కొంటున్నప్పుడు వినియోగదారులపై భారం పడుతుంది. అందువల్ల డబ్ల్యూపీఐని ధరల పెరుగుదలకు ముందస్తు హెచ్చరిక సంకేతంగా పరిగణిస్తారు.

ఇప్పటికే మార్పులు ఇలా... రిటెయిల్ ద్రవ్యోల్బణం మార్చిలో 3.4% కాగా, ఏప్రిల్‌లో 3.48 శాతానికి చేరింది. ఆర్‌బీఐ లక్ష్యమైన 4% కంటే తక్కువే. ఆహార ద్రవ్యోల్బణం 4.2 శాతానికి చేరినా, ప్రధాన ద్రవ్యోల్బణం దాదాపు స్థిరంగానే ఉంది. టోకు ద్రవ్యోల్బణం మార్చిలో 3.88% కాగా.. ఇంధన, విద్యుత్తు ఛార్జీల పెరుగుదలకు అనుగుణంగా ఏప్రిల్‌లో 8.3 శాతానికి పెరిగింది. ఇది 42 నెలల గరిష్ఠ స్థాయి. ఇంధన, విద్యుత్ విభాగ ద్రవ్యోల్బణం మార్చిలో 1.05 శాతంగా ఉండగా, ఏప్రిల్‌లో 24.71 శాతానికి చేరింది. ముడి పెట్రోలియం ద్రవ్యోల్బణం 88 శాతానికి పైగా పెరిగింది.

చమురు ప్రభావం ..... రిటెయిల్ ద్రవ్యోల్బణ గణనలో పెట్రోల్, డీజిల్‌లకు ప్రత్యేక విభాగం లేదు. కానీ 'రవాణా, సమాచార' విభాగాలు 'ఇంధనం, విద్యుత్' కిందకు వస్తాయి. రవాణాలో పెట్రోల్, డీజిల్‌కే గణనీయమైన వెయిటేజీ ఉంటుంది. ఈ ధరల పెంపు వల్ల సరకు రవాణా, లాజిస్టిక్స్, ముడి సరకుల ఖర్చులు పెరుగుతాయి. డబ్ల్యూపీఐ గణనలో ఇంధనం, విద్యుత్ విభాగ వెయిటేజీ సుమారు 13.15%. అధిక ఇంధన ధరలు.. రవాణా ఖర్చులు, సరకు రవాణా ఛార్జీలు, ఆహార పంపిణీ ఖర్చులు, వ్యవసాయ ఉత్పాదక వ్యయాలు, తయారీ ఖర్చులు, విమానయాన, లాజిస్టిక్స్ ఖర్చులను పెంచుతాయి. ఈ నెలలో టోకు ద్రవ్యోల్బణం 9 శాతానికి చేరుకోవచ్చన్నది ఆర్థికవేత్తల అంచనా.

పరోక్ష ప్రభావాలు ఇలా.... దేశంలో అత్యధికంగా (సుమారు 40%) ఉపయోగించే ఇంధనం డీజిల్. ట్రక్కులు, బస్సులు, వ్యవసాయ పంపులు, జనరేటర్లు, పారిశ్రామిక రవాణా వ్యవస్థలకు మూలం. ఈ ధర పెరిగితే కూరగాయలు, పాలు, ప్యాకేజీ చేసిన వస్తువులు, సిమెంటు, ఉక్కు, సేవల ధరలు భారమవుతాయి. ఇంధనం, ఆహారం, రవాణా, తయారీ వస్తువుల ధరలు పెరగడం వల్ల మే నెలలో రిటెయిల్ ద్రవ్యోల్బణమూ పెరిగే అవకాశం ఉంది. పెట్రో ఉత్పత్తులతో పాటు పాల ధరల పెరుగుదల ప్రభావం.. జులై మధ్యలో విడుదలయ్యే జూన్ రిటెయిల్ ద్రవ్యోల్బణ గణాంకాల్లో పూర్తిగా ప్రతిబింబించనుంది. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు సరిగా కురవకపోతే, ఆహార ధరలు మరింత పెరగొచ్చు. రిటెయిల్ ద్రవ్యోల్బణంలో ఆహారానికి అధిక ప్రాధాన్యత ఉన్న సంగతి విదితమే.

ఆర్‌బీఐ ఆచితూచి అడుగులే

ప్రస్తుత పరిస్థితుల్లో వడ్డీ రేట్లపై జాగ్రత్తతో కూడిన యథాస్థితిని ఆర్‌బీఐ కొనసాగిస్తుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. రెపో రేటును 5.25% వద్దే ఉంచేందుకు మొగ్గు చూపొచ్చని అంటున్నారు. టోకు ద్రవ్యోల్బణ ప్రభావం ఎంతమేరకు రిటెయిల్ ద్రవ్యోల్బణానికి బదిలీ అవుతుందో పరిశీలించాకే, విధాన నిర్ణయాలను ఆర్‌బీఐ ప్రకటిస్తుంది. సమీప భవిష్యత్తులో ఆర్‌బీఐ కరెన్సీ స్థిరత్వం, ద్రవ్యోల్బణ నియంత్రణపై దృష్టి సారించే అవకాశం కనిపిస్తోంది. రూపాయిని బలోపేతం చేసే దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు...
ల్యాప్ టాప్ చోరీ ఆరోపణతో మనస్థాపం...

సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి ఆత్మహత్య

ఈకబురు, శేరిలింగంపల్లి : డ్రగ్స్ కు బానిసగా మారిన కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఓ వైపు... గతంలో ల్యాప్ టాప్ చోరీని బూచిగా చూపి ప్రస్తుతం చేయని చోరీ ఆరోపణలతో మనస్థాపం మరోవైపు.. దీనికి తోడు పోలీసులకు తోటి విద్యార్థులు పిర్యాదు చేయడంతో భయాందోళనకు గురైన సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి క్యాంపస్ లోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యార్థి ఆత్మహత్యతో యూనివర్సిటీ లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం...

పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పరగానాస్ జిల్లా బరిషా గ్రామానికి చెందిన మయుక్ కుండు(23) హైదరాబాద్ లోని సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్ మొదటి సంవత్సరం చదువుతూ క్యాంపస్‌లోని ఎఫ్ హాస్టల్‌లో ఎంఏ రెండవ సంవత్సరం విద్యార్థితో కలిసి ఉంటున్నాడు. మయుక్ గతంలో హాస్టల్ లో ల్యాప్ టాప్ తీసుకువెళ్లాడు. ఈ విషయమై తోటి స్నేహితులు నిలదీయడంతో ల్యాప్ టాప్ తిరిగి ఇచ్చేశాడు. ఇటీవల క్యాంపస్‌లోని రీడింగ్ రూంలో రెండు లాప్టాప్‌లు కనిపించకుండా పోయాయి. దీంతో ఆ ల్యాప్ టాప్ లు మయుక్ దొంగలించాడని తోటి విద్యార్థులు ఆరోపణలు చేశారు. దొంగిలించిన ల్యాప్ టాప్ లు తిరిగి ఇవ్వాలని, లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని

ఆత్మహత్య చేసుకున్న యూనివర్సిటీ విద్యార్థి మయుక్ కుండు (ఫైల్ ఫోటో)

మయుక్‌ను హెచ్చరించారు. దాంతో మనస్థాపానికి గురైన మయుక్ సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో హాస్టల్ గది నుండి బయటకు వెళ్లిపోయాడు. అదే సమయంలో యూనివర్సిటీకి చెందిన ఓ విద్యార్థిని, విద్యార్థి కలిసి తమ ల్యాప్ టాప్ లు దొంగతనం అయ్యాయని గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా హాస్టల్ నుంచి వెళ్లిన మయుక్ ఆచూకీ లభించకపోగా, మంగళవారం మధ్యాహ్నం క్యాంపస్ ఆవరణలో ఉన్న బఫెల్లో లేక్‌లో మయుక్ మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మయుక్ మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం తీవ్ర ఉద్రిక్తత మధ్య, భారీ పోలీసు బందోబస్తుతో మయంక్ మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

ఆర్థిక ఇబ్బందులు... డ్రగ్స్ అలవాటు...

కాగా మయుక్ గదిలో పోలీసులు సూసైడ్ నోట్ ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ కు బానిసగా మారి, ఆర్థిక ఇబ్బందులతో గతంలో ల్యాప్ టాప్ లు చోరీ చేసానని, తోటి విద్యార్థులతో ఈ చోరీపై సెటిల్ మెంట్ చేసుకున్నట్టు రాశాడు. కాగా ప్రస్తుతం ఆరోపిస్తున్నట్టుగా తాను ఎటువంటి ల్యాప్ టాప్ లు చోరీ చేయలేదని అందులో పేర్కొన్నాడు. మయుక్ రాసిన సూసైడ్ నోట్ ను స్వాధీనం చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ముంచుకొస్తున్న ఆర్థిక తుపాను: రాహుల్

ఈకబురు :రాయ్‌బరేలీ: ఆర్థిక తుపాను దేశం వైపు ముంచుకొస్తోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ తాను పిలుపునిచ్చిన పొదుపు చర్యలను తానే పాటించడం లేదని వ్యాఖ్యానించారు. విదేశీ పర్యటనలను మానేయాలని ప్రజలకు చెప్పిన ఆయనే ఐరోపా దేశాల పర్యటనకు వెళ్లారని ఎద్దేవా చేశారు. ప్రస్తుత ప్రభుత్వం మారేంతవరకూ ద్రవ్యోల్బణం పెరుగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. తన సొంత నియోజకవర్గంలోని బఛ్‌రావాలో మంగళవారం జరిగిన సభలో రాహుల్ మాట్లాడారు. ''ప్రపంచం మొత్తం త్వరలో తీవ్ర చమురు, ఎరువుల కొరతను ఎదుర్కోబోతోంది. ఈ సంక్షోభాన్ని మన జీవితాల్లో మనం ఎప్పుడూ చూసి ఉండం. దీనినెవరూ ఆపలేరు. దీని ప్రభావం ఎవరిపై పడుతుంది.. అదానీ, అంబానీలు వారి ప్యాలెస్‌లలో భద్రత మధ్య బాగానే ఉంటారు. కానీ మన రైతులు, యువత, చిన్న వ్యాపారులు, చిన్న పరిశ్రమల వారు తీవ్రంగా నష్టపోతారు'' అని పేర్కొన్నారు.

మోదీ రిమోట్ కంట్రోల్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేతిలో ఉందని రాహుల్ విమర్శించారు. మోదీ విదేశాలకు వెళ్లి ఎప్‌స్టీన్ ఫైళ్ల నుంచి తనను రక్షించాలని వేడుకుంటారని, అదానీని కాపాడాలని కోరుకుంటారని వ్యాఖ్యానించారు.

పెట్రో ధరలను పెంచి ప్రజలను దోచుకోవడం, పారిశ్రామికవేత్త అదానీకి అమెరికా నుంచి క్లీన్‌చిట్ తెప్పించడమే మోదీ విధానమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఆర్థిక విధానాల్లో ఆయన విఫలమయ్యారని, భాజపా నేతలకు ముందు చూపు లేదని వ్యాఖ్యానించారు.

తీరం మనదే.. మత్స్య సంపదా మనదే

దీంతో తమకు డబ్బులు జమ అయ్యాయంటూ సంతోషం వ్యక్తం చేస్తూ సెల్ ఫోన్లల్లో వచ్చిన మెసేజీలను ముఖ్యమంత్రికి లబ్దిదారులు చూపించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."సముద్ర తీర ప్రాంతంలో పోర్టులు వస్తే అభివృద్ధి జరుగుతుంది. తీర ప్రాంతంలో జరిగే అభివృద్ధిలో మత్స్య కారులకూ భాగస్వామ్యం ఉండాలి. అభివృద్ధిని మత్స్య కారులు అందిపుచ్చుకునేలా ప్రణాళికలు చేస్తాం. కావలి ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు అవుతోంది. దీని ద్వారా స్థానికులకే ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయి. రూ.288 కోట్లతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపడుతున్నాం. మత్స్య కారులను ఆర్థికంగా బలోపేతం చేసేలా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ కేంద్రంగా ప్రణాళికలు సిద్దం చేస్తున్నాం. వీటిపై కొందరు అపోహలు సృష్టించే ప్రయత్నం చేశారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలకూ తావులేదు. ఫేక్ ప్రచారాలను నమ్మవద్దు. ఈ తీరం మనది, బోటూ మనదే.. ఇక్కడ సంపద కూడా మనదే. ఈ విషయంలో రాజీ లేదు. మన తీరప్రాంతానికి పొరుగు రాష్ట్రం వారు ఎవరొచ్చినా సహించేది లేదు. మత్స్యకారుల హక్కులు కాపాడతాం. మన తీరప్రాంతంలో నిఘా పెట్టి పొరుగు రాష్ట్రాల బోట్లు రాకుండా చర్యలు తీసుకుంటాం. తీరం మనదే, బోటు మనదే వేటా మనదే ఇదే సీబీఎన్ మాట."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్ లా వ్యవహరిస్తా...

"రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువుల్లో నీళ్లు నిండుగా ఉన్నాయి. అక్కడ చేపల పెంపకం చేపట్టండి. ఆ మత్స్య సంపదను విక్రయించుకునే హక్కులను మత్స్య కారులకే అప్పగించాం. రాష్ట్రవ్యాప్తంగా నీటి వనరుల్లో ఫిష్ సీడ్ ను అందించేలా మత్స్య శాఖకు ఆదేశాలిచ్చాం. చేపల వేటతో పాటు కొత్త ఆదాయ మార్గాలను కూడా మత్స్య కారులకు అందుబాటులోకి తెస్తాం. మన రాష్ట్రానికి సుదీర్ఘ సముద్ర తీరప్రాంతం ఉంది. సముద్ర తీరప్రాంతంలో నివసించే మత్స్య కారుల జీవితాల్లో వెలుగులు నింపేలా చర్యలు చేపడుతున్నాం. టెక్నాలజీతోపాటు... వినూత్న పద్ధతుల ద్వారా మత్స్య కారులను ఆర్థికంగా ఆదుకుంటాం. చేపల వేటకు వెళ్లే మత్స్య కారులకు అండగా నిలబడడమే కాకుండా... మత్స్య కార మహిళలకు ఉపాధి కల్పించి.. ఆర్థిక సాధికారత కల్పిస్తాం. సీవీడ్ కల్చర్ ద్వారా మత్స్య కారుల జీవితాల్లో వెలుగులు నింపుతాం. మత్స్య కార మహిళలు, డ్వాక్రా సంఘాల మహిళలు సముద్రపు నాచు పెంపకం ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా చేస్తాం. చేపలు మంచి పౌష్టికాహారం. ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ప్రోటీన్ ఉన్న ఈ ఆహారానికి అన్ని చోట్లా గిరాకీ ఉంది. మత్స్య ఉత్పత్తులకు గిరాకీ సృష్టించేలా మార్కెటింగ్ మేనేజర్ గా వ్యవహరిస్తాను."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

మత్స్య కారుల సేవలో ఉంటాం... అండగా నిలుస్తాం

"దేశంలో చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉంది. ఇది కొనసాగాలంటే... మత్స్య కారులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి... వారికి అండగా నిలవాలి. ఆ దిశగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. మత్స్య కారులకు మేం అండగా ఉంటాం. మెకనైజ్డ్, మోటరైజ్డ్ డీజిల్ పడవలకు లీటరుకు రూ.9 మేర డీజిల్ సబ్సిడీ ఇస్తున్నాం. 2026 27లో రూ.50 కోట్ల విలువైన డీజిల్ సబ్సిడిని మత్స్య కార బోట్లకు అందించాం. రూ.3256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్లు, 8 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను కూడా ప్రభుత్వం నిర్మిస్తోంది. మత్స్య కారుల రక్షణ కోసం సముద్రంలో 4,550 ట్రాన్స్ పాండర్లను ఏర్పాటు చేసి కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. పడవలు, వలలు, పరిహారం సకాలంలోనే ప్రభుత్వం అందిస్తోంది. 200 మెకనైజ్డ్ బోట్లను మత్స్యకారుల కోసం శాంక్షన్ చేస్తాం. 60 శాతం సబ్సిడీ ఇవ్వటంతో పాటు మిగిలిన మొత్తాన్ని రుణంగా మంజూరు చేస్తాం. మత్స్య కారులు సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు చేపలు ఎక్కడ లభ్యం అవుతాయో అనే సమాచారాన్ని కూడా ఇస్తున్నాం. మెకనైజ్డ్ బోట్లతో సులువుగా చేపల వేట చేసేలా ప్రభుత్వం సహకారం అందిస్తుంది. ఆక్వా కల్చర్ కు అభివృద్ధి కోసం ఒక్కో యూనిట్ కు రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మన రాష్ట్రానికి ఏ రంగంలో ఆదాయం వస్తుందో దానిపై శ్రద్ధ పెట్టి ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. చేపల వేట నిషేధ సమయంలో మత్స్య కారుల సేవలో పేరిట రూ.20 వేల చొప్పున చేయూత అందిస్తున్నాం. రాష్ట్రంలో మత్స్య కారుల సంక్షేమం గురించి నిరంతరం ఆలోచిస్తూ వారిని ఆదుకుంటున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతీ మత్స్య కార కుటుంబానికి 50 కేజీల చొప్పున బియ్యం ఇచ్చి సాయం చేశాం. 201419 మధ్యలోనూ చేపలవేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల వరకూ ఆర్థిక సాయం చేసి టీడీపీ ప్రభుత్వం ఆదుకుంది. మళ్లీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.20 వేలకు ఆర్థిక సాయాన్ని పెంచి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

విధ్వంసం నుంచి వికాసం వైపు...

"గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. ఎక్కడా అభివృద్ధి చేయలేదు. సంక్షేమం అందించలేదు. అన్ని రంగాలను విధ్వంసం చేశారు.. వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. అలాగే మత్స్య రంగం కూడా దెబ్బతినేలా చేశారు. రాష్ట్రానికున్న సుదీర్ఘమైన తీరప్రాంతంలో లక్షల మంది మత్స్య కారులు చేపల వేటతో ఉపాధి పొందుతున్నారు. వారికి నాటి ఐదేళ్ల పాలనలో కష్టాలే ఉన్నాయి. 201924 మధ్యలో చేపల ఉత్పత్తి దారుణంగా పడిపోయింది. వ్యవసాయం, నిర్మాణ రంగం తర్వాత మత్స్య సంపద పైనే ఎక్కువ మంది ఆధారపడుతున్నారు. ఇలాంటి రంగాన్ని కూడా వాళ్లు విధ్వంసం బాట పట్టించారు. గొడ్డలి పార్టీ లేనిపోని కుట్రలు చేస్తోంది. కూటమి ప్రభుత్వం సంక్షేమం చేస్తుంటే గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాలు చేస్తోంది. బాబాయ్ హత్య నుంచి పెద్ద దస్తగిరి వరకూ హత్యలు చేస్తూ... కుట్రలు పన్నుతూ రాష్ట్రాన్ని వెనక్కు లాగుతోంది. వైసీపీ చేసిన విధ్వంసాన్ని సరి చేయడానికి 23 నెలల సమయం పట్టింది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించటంతో పాటు విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లుగా ఏపీని అభివృద్ధి చేస్తున్నాం. బుల్లెట్ స్పీడ్ లో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. 24 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వస్తాయి. రాయలసీమలో డిఫెన్సు, డ్రోన్స్, స్పేస్ ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ రంగంలో పరిశ్రమలు వస్తున్నాయి. రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ తిరుపతి వద్ద బుల్లెట్ మోటారు సైకిల్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. నెల్లూరు జిల్లాకు పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చాయి. మరిన్ని వస్తాయి. పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రాంతంలో 25 మత్స్య కారుల గ్రామాలను కనెక్టు చేస్తూ మెటల్ రోడ్లు వేస్తాం. నార్త్ బకింగ్ హామ్ కెనాల్ డీసిల్టింగ్ కు రూ.6.19 కోట్లను మంజూరు చేస్తున్నాం. ఈ కాలువను ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ గానూ తీర్చిదిద్దుతాం. ప్రతీ ఇంటిపైనా, పొలంలోనూ సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

టీడీపీ డీఎన్ఏలోనే బీసీలు.

"టీడీపీ డీఎన్ఏలోనే బీసీలు ఉన్నారు. బీసీలకు టీడీపీకి దశాబ్దాల అనుబంధం. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేల వేతనం, వడ్డెర్లకు, గీత కార్మికులకు గనులు, మద్యం దుకాణాలను కేటాయిస్తున్నాం. 45 ఏళ్లుగా బీసీలు టీడీపీని ఆదరించారు. వారి రుణం తీర్చుకుంటాం. బీసీల కోసం... బీసీ మహిళల కోసం కొత్త విధానాలను అమల్లోకి తెచ్చి.. వారిని ఆర్థికంగా చేయూత ఇస్తున్నాం. సీవీడ్ లాంటి కొత్త ప్రత్యామ్నాయాలను ఎంచుకోవటం ద్వారా అదనపు ఆదాయం సంపాదించేలా చర్యలు చేపడతాం. మత్స్య కారుల జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది. మత్స్య కార యువతకు నైపుణ్యాలు నేర్పి ఆదాయాన్ని రెట్టింపు చేసేలా ప్రయత్నిస్తున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు అంతా ప్రజల సేవకులే. జవాబుదారీతనంతో పనిచేయాలనే లక్ష్యాన్ని పెట్టాం. పశ్చిమ ఆసియాలో యుద్ధ ప్రభావం మనపై కూడా పడింది. ఆయిల్ ధరలు పెరిగాయి. గ్యాస్ కొరత ఉంది. మనం అంతా నా దేశం నా బాధ్యత అనుకుని పనిచేయాలి. ప్రధాని మోదీ 7 సూత్రాలను సూచించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాలి. అనవసరపు ప్రయాణాలు తగ్గించుకుందాం. ప్రజా రవాణాను మాత్రమే వినియోగిద్దాం. బంగారం కొనుగోలును వాయిదా వేద్దాం. టూరిజం కోసం విదేశీ ప్రయాణాలు తగ్గించుకుందాం. మన దేశంలోనే పర్యాటక ప్రాంతాలు, బీచ్ లకు వెళ్లాలి."అని ముఖ్యమంత్రి సూచించారు.

మత్స్యకార మహిళలకు సీవీడ్ సాగులో శిక్షణ

మత్స్య కారుల సేవలో బహిరంగ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, ఉద్యాన శాఖల స్టాళ్లను ముఖ్యమంత్రి తిలకించారు. అలాగే సీవీడ్, తీర ప్రాంత నిఘా కేంద్రాన్ని సందర్శించారు. తీర ప్రాంతంలో సముద్రపు నాచు సాగు చేసేలా మత్స్య కార మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీఎస్ఎంసీఆర్ఐ సహకారంతో మత్స్యకార మహిళలు అదనపు ఆదాయం పొందేలా సీవీడ్ కల్చర్ చేసేందుకు శిక్షణ ఇవ్వనున్నారు. తీరప్రాంతాల్లో మహిళలు సముద్రంలో సీవీడ్ సాగు చేసేలా శిక్షణతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. డీఆర్డీఓ, వెపన్ సిస్టమ్స్ తయారీ కంపెనీల స్టాళ్లను సీఎం సందర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనం రామనారాయణ రెడ్డి, అచ్చెన్నాయుడు, ఫరూఖ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఒప్పందం కుదరకుంటే విరుచుకుపడతాం

అయితే అరబ్ దేశాల నేతల విజ్ఞప్తి మేరకు చివరి నిమిషాల్లో ఆ ప్రణాళికను తాత్కాలికంగా పక్కనపెట్టానన్నారు. టెహ్రాన్‌తో చర్చలు సీరియస్‌గా సాగుతున్నాయని, అందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదిరే అవకాశాలు ఉండటం వల్లే దాడుల నిర్ణయాన్ని ప్రస్తుతానికి ఉపసంహరించుకున్నామని తెలిపారు.

మమ్మల్ని ఓడించడం సాధ్యం కాదు ఇరాన్

అమెరికాఇజ్రాయెల్ మళ్లీ దాడులు చేస్తే.. తాము యుద్ధరంగంలో కొత్త సాధనాలతో, సరికొత్త విధానాల్లో విరుచుకుపడతామని ఇరాన్ హెచ్చరించింది. తమను దిగ్బంధించడం, ఓడించడం ఎవరికీ సాధ్యం కాదని పేర్కొంది. టెహ్రాన్‌లోని వాలియాస్ స్క్వేర్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ఆ దేశ సైన్యాధికారి బ్రిగేడియర్ జనరల్ మహమ్మద్ అక్రమీనియా ఈ వ్యాఖ్యలు చేశారు. తమ సాయుధ దళాలు గతంలో కంటే ఇప్పుడు మరింత బలంగా, సన్నద్ధంగా ఉన్నాయని ఇరాన్ పేర్కొంది. సైన్యం ట్రిగ్గర్‌పై వేలు పెట్టి సిద్ధంగా ఉందని హెచ్చరించింది.

ట్రంప్, నెతన్యాహులను హతమారిస్తే రూ.560 కోట్లు!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను హతమారిస్తే.. 58 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.560 కోట్లు) బహుమతిగా ఇస్తామని ఇరాన్ త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు 'ఇస్లామిక్ రిపబ్లిక్ భద్రతా దళాల ప్రతిచర్య' పేరిట బిల్లును సిద్ధం చేస్తున్నట్లు ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఛైర్మన్ ఇబ్రహీమ్ అజీజ్ తెలిపారు. దీనిపై త్వరలోనే పార్లమెంటులో ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. తమ దేశంలోని బరకాహ్ అణు విద్యుత్కేంద్రంపై ఇటీవల దాడి చేసిన డ్రోన్లు ఇరాక్ భూభాగం నుంచి దూసుకొచ్చాయని యూఏఈ రక్షణ శాఖ మంగళవారం వెల్లడించింది. ఇరాన్ మద్దతున్న షియా మిలీషియాలు వాటిని ప్రయోగించి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

యుద్ధంతో జీవ వైవిధ్యానికి దెబ్బ

ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ ఇటీవల చేసిన దాడులు పర్యావరణానికి హానికరంగా మారి, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ ఆయిల్ రిఫైనరీపై జరిగిన ఓ దాడితో సముద్ర జలాల్లోకి చమురు చేరి.. అలల ద్వారా పర్షియన్ గల్ఫ్‌లోని శిద్వార్ దీవిపైకి కొట్టుకొచ్చింది. అది జనావాసాల్లేని దీవి. వణ్యప్రాణులు చాలానే ఉన్నాయి. చమురు వ్యాప్తితో వాటి మనుగడకు సమస్యలు తలెత్తుతున్నాయి.

భారత్‌కు రానున్న పుతిన్

ఈ కబురు: రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ ఏడాది సెప్టెంబరులో భారత పర్యటనకు రానున్నారు. క్రెమ్లిన్ ప్రతినిధి యూరీ ఉషకొవ్ ఈ విషయాన్ని వెల్లడించారు. దిల్లీ వేదికగా సెప్టెంబరు 12,-13వ తేదీల్లో జరగనున్న బ్రిక్స్ (BRICS) శిఖరాగ్ర సదస్సులో పుతిన్ పాల్గొంటారని తెలిపారు.ఏడాది వ్యవధిలో పుతిన్ రెండోసారి భారత్‌లో పర్యటించనున్నారు. భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సులో భాగంగా గతేడాది డిసెంబరులో ఆయన మనదేశానికి వచ్చిన సంగతి తెలిసిందే. రెండుదేశాల సంబంధాల బలోపేతంపై ప్రధాని నరేంద్రమోదీతో చర్చలు జరిపారు. 2026 ఏడాదికి బ్రిక్స్ ఛైర్మన్‌గా భారత్ వ్యవహరిస్తోంది. దీనిలో భాగంగా ఇటీవల జరిగిన బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశానికి రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్రోవ్ హాజరైన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా మోదీతో భేటీ అయ్యారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సహా పలు అంశాలపై చర్చలు జరిపారు. మొదట బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో 'బ్రిక్' ఏర్పడింది. అనంతరం దక్షిణాఫ్రికా చేరడంతో బ్రిక్స్‌గా మారింది. ఇప్పుడు ఇరాన్, ఇథియోపియా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండోనేసియా కూడా చేరాయి. ఈ పది దేశాలను కలిపి బ్రిక్స్ ప్లస్‌గా వ్యవహరిస్తున్నారు. సౌదీ అరేబియా, అర్జెంటీనాలు ఇంకా లాంఛనంగా బ్రిక్స్‌లో చేరలేదు. బ్రెజిల్‌లోని రియో డి జనీరో నగరంలో గతేడాది బ్రిక్స్ సదస్సు జరిగింది. కాగా.. పుతిన్ ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్నారు.

తెలంగాణ నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

- 34 నుంచి 44 ఏళ్లకు పెంపు
- నిరుద్యోగుల వినతుల మేరకు ఉత్తర్వులు
- ఏడాది పాటు వచ్చే అన్ని నోటిఫికేషన్లకు వర్తింపు
- నియామకాల ఆలస్యం వల్ల నష్టపోయిన అభ్యర్థులకు లబ్ధి
- యూనిఫాం సర్వీసుల ఉద్యోగాలకు పెంపు వర్తించదు

ఈ కబురు, హైదరాబాద్ ;
తెలంగాణలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి గరిష్ఠ వయోపరిమితిని మరో పదేళ్ల పాటు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది.

ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం సాధారణ ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి గరిష్ఠ వయోపరిమితి 34 ఏళ్లుగా ఉంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇది ఇప్పుడు 44 ఏళ్లకు పెరిగింది. ఈ అదనపు వయో సడలింపు నిబంధన ఏడాది పాటు రానున్న అన్ని నోటిఫికేషన్లకు వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యోగాల భర్తీలో జరిగిన ఆలస్యం, కరోనా మహమ్మారి, నోటిఫికేషన్లు రాకపోవడం వంటి కారణాల వల్ల ఎంతోమంది నిరుద్యోగులు వయోపరిమితి దాటిపోయి నష్టపోయారు. ఈ నేపథ్యంలో వయోపరిమితిని పెంచాలంటూ నిరుద్యోగ యువత, అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన వినతులను సానుకూలంగా పరిశీలించిన ప్రభుత్వం ఈ పదేళ్ల సడలింపు ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.రాష్ట్రంలోని వివిధ నియామక సంస్థలు జారీ చేసే అన్ని రకాల జనరల్ ఉద్యోగాల నోటిఫికేషన్లకు ఈ కొత్త నిబంధన వర్తిస్తుంది. అయితే శారీరక దారుఢ్య ప్రమాణాలు అవసరమైన యూనిఫాం సర్వీసులకు మాత్రం ఈ సడలింపు వర్తించదు. పోలీస్, ఎక్సైజ్, ఫైర్, జైళ్లు, అటవీ శాఖల ఉద్యోగాలకు పాత నిబంధనలే కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఆరంభ లాభాలు ఆవిరి.. మరింత పతనమైన రూపాయి

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ట్రేడైన సూచీలు..మధ్యాహ్నం తర్వాత అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా బ్యాంక్, ఫైనాన్షియల్, మెటల్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. మరోవైపు, రూపాయి విలువ పతనం కొనసాగుతోంది. ఇంట్రాడేలో 96.61 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకిన రూపాయి విలువ.. మార్కెట్ ముగిసే సమయానికి 96.52కు చేరింది.సెన్సెక్స్ ఉదయం 75,441.27 (క్రితం ముగింపు 75,315.04) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,746.27 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకుంది. చివరికి 114.19 పాయింట్ల నష్టంతో 75,200.85 వద్ద స్థిరపడింది.నిఫ్టీ సైతం 31.95 పాయింట్ల నష్టంతో 23,618 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో కోటక్ మహీంద్రా బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఎటర్నల్, టీసీఎస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 110 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4540 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

ఆలయాల్లో బంగారం మానిటైజ్ చేస్తారంటూ ప్రచారం

..స్పందించిన కేంద్రం

దేశవ్యాప్తంగా ఆలయాల్లోని బంగారాన్ని మానిటైజేషన్ చేస్తారని, గోల్డ్ బాండ్లు జారీ చేస్తారంటూ సోషల్ మీడియాలో కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రచారం పూర్తిగా అవాస్తవమని తోసిపుచ్చింది. ఆలయాల్లో బంగారాన్ని మానిటైజ్ చేస్తారంటూ వస్తున్న కథనాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమంటూ కేంద్ర ఆర్థికశాఖ కొట్టిపారేసింది. అలాంటి నిర్ణయమేదీ కేంద్రం తీసుకోలేదని స్పష్టం చేసింది. అవన్నీ తప్పుదోవ పట్టించే కథనాలేనని తెలిపింది. ధ్రువీకరణ లేని సమాచారాన్ని విశ్వసించడం లేక ప్రచారం చేయడం మానుకోవాలని సూచించింది. ఇలాంటి తప్పుడు సమాచారం ప్రజల్లో అనవసర భయాన్ని, గందరగోళాన్ని సృష్టిస్తుందని హెచ్చరించింది. ఏవైనా విధానపరమైన నిర్ణయాలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం ఏదైనా సరే అధికారిక పత్రికా ప్రకటనలు, ప్రభుత్వ వెబ్‌సైట్‌ల ద్వారా షేర్ చేస్తామని తెలిపింది.

ఏఐతో ఉద్యోగ సంక్షోభం

.. ఆంథ్రోపిక్ సీఈఓ వ్యాఖ్యలు

వాషింగ్టన్: అమెరికాకు చెందిన ఏఐ కంపెనీ ఆంథ్రోపిక్ సీఈవో డారియో అమోడెయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తరణ వల్ల భవిష్యత్‌లో తీవ్ర ఉద్యోగ సంక్షోభం పొంచి ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా అన్ని రంగాల్లో ఎంట్రీ లెవల్ వైట్‌కాలర్ ఉద్యోగాలను ఏఐ భర్తీ చేయబోతోందని పేర్కొన్నారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈమేరకు ఆయన మాట్లాడారు.రెండేళ్ల క్రితం ఒక తెలివైన హైస్కూల్ పిల్లాడి స్థాయిలో ఉన్న ఏఐ సాంకేతికత.. ఇప్పుడు ఒక తెలివైన కాలేజీ స్టూడెంట్, అంతకుమించి వేగంగా దూసుకెళుతోందని డారియో అభిప్రాయపడ్డారు. డాక్యుమెంట్లను సమరైజ్ చేయడం, కొత్త ఐడియాలతో ముందుకురావడం, ఫైనాన్షియల్ రిపోర్టులు తయారుచేయడం వంటి పనులను ఏఐ సులువుగా చేసేస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల ముఖ్యంగా ఫైనాన్స్, కన్సల్టింగ్, టెక్నాలజీ వంటి రంగాల్లో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు తీవ్ర ప్రభావితం అవుతాయని తెలిపారు.రాబోయే ఒకటి నుంచి ఐదేళ్ల లోపే ఏఐ ప్రభావం మార్కెట్‌లో స్పష్టంగా కనిపించవచ్చని డారియో అంచనా వేశారు. దీనివల్ల తీవ్రమైన ఉద్యోగ సంక్షోభం చవిచూడబోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. చాలామంది ఏఐ సంస్థల సీఈవోలు, ఇతర కంపెనీల అధినేతలు ఈ విషయంపై వ్యక్తిగతంగా ఆందోళన చెందుతున్నారని చెప్పారు. సాధారణ ప్రజలకు, ప్రభుత్వాలకు ఈ సమస్య తీవ్రత ఇంకా పూర్తిగా అర్థం కావడం లేదన్నారు. ఉద్యోగాలకు ముప్పు పొంచిఉందన్న ఆందోళనలు ఉన్నప్పుడు.. ఏఐ అభివృద్ధిని ఆపొచ్చన్న సందేహాలు చాలామందికి తలెత్తొచ్చు. దానిపైనా డారియో వివరణ ఇచ్చారు. అమెరికా, చైనా కంపెనీల మధ్య ప్రస్తుతం తీవ్రమైన పోటీ నెలకొందని, ఈ కారణంగానే ఏఐ అభివృద్ధిని ఇప్పుడు ఆపడం సాధ్యం కాదని డారియో స్పష్టంచేశారు. ఒకవేళ అమెరికన్ కంపెనీలు ఏఐ అభివృద్ధిని ఆపితే.. చైనా మమ్మల్ని అధిగమిస్తుందన్నారు. ఉద్యోగ ముప్పు నుంచి బయటపడాలంటే ఏఐ టూల్స్ ఉపయోగించడంలో నైపుణ్యాలను పెంచుకోవాలని ఉద్యోగులకు సూచించారు. ఆర్థిక అసమానతలను తగ్గించడానికి, కార్మికులను ఆదుకోవడానికి భవిష్యత్‌లో ఏఐ కంపెనీలపై ప్రభుత్వాలు ప్రత్యేక పన్నులు విధించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని డారియో అభిప్రాయపడ్డారు.

10శాతం ఉద్యోగులకు లేఆఫ్‌లు

.. 7వేల మందికి ఏఐ రోల్స్: మెటా

కృత్రిమ మేధపై దృష్టిపెడుతోన్న టెక్ దిగ్గజాలు ఈ ఏడాది కూడా ఉద్యోగుల తొలగింపులు కొనసాగిస్తున్నాయి. ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా (Meta) కూడా భారీ లేఆఫ్‌లను ప్రకటించింది. ఆ ప్రణాళికలకు సంబంధించిన వివరాలను తాజాగా ఉద్యోగులకు వెల్లడించింది. కంపెనీలో 10శాతం మందిపై వేటు వేసింది. మే 20 నుంచి ఈ లేఆఫ్‌లు (Layoffs) ప్రారంభం కానున్నట్లు తెలిపింది. అదే సమయంలో 7000 మంది ఉద్యోగులను ఏఐ విధుల్లోకి మార్చనున్నట్లు పేర్కొంది.ఈ మేరకు మెటా హెచ్‌ఆర్ చీఫ్ జానెల్లె గేల్ ఉద్యోగులకు ఇంటర్నల్ మెమో పంపారు. ''ఏఐ విధివిధానాలకు అనుగుణంగా చాలా సంస్థలు పునర్‌వ్యవస్థీకరణ చర్యలు చేపట్టాయి. మనం కూడా ఆ మార్పులను అమలుచేయాల్సిన దశలో ఉన్నాం. ఇందులోభాగంగానే 10శాతం ఉద్యోగులకు లేఆఫ్‌లు విధించాలని నిర్ణయించాం. మేనేజర్ స్థాయి విధుల్లో ఉన్నవారిని పూర్తిగా పక్కన బెడతాం. ఇక, దాదాపు 7వేల మంది ఉద్యోగులను ఏఐ సంబంధిత కొత్త ప్రాజెక్టుల్లోకి మార్చనున్నాం. ఇప్పటికే కొంతమంది ట్రాన్స్‌ఫర్లు పూర్తయ్యాయి. మిగిలిన వారికి మే 20 నుంచి అప్‌డేట్లు వస్తాయి. ఇక, ఈ పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికల్లో భాగంగా 6వేల కొత్త రోల్స్‌ను తీసుకురానున్నాం'' అని గేల్ తన మెమోలో వెల్లడించారు.మార్చి చివరికి ప్రపంచ వ్యాప్తంగా మెటాకు దాదాపు 78 వేల మంది ఉద్యోగులున్నారు. ఇందులో 10శాతం అంటే..దాదాపు 8 వేల మందిని కంపెనీ ఉద్యోగం నుంచి తొలగించనుంది. తాజా ప్రకటన ప్రకారం చూసుకుంటే.. ఈ లేఆఫ్‌లు, ట్రాన్స్‌ఫర్లు కలిపి సంస్థలోని మొత్తం 20శాతం సిబ్బందిపై ప్రభావం పడనుంది. ఈ ఏడాది చివర్లో మరికొంతమంది ఉద్యోగులను తొలగించేందుకు కంపెనీ ప్రణాళికలు చేస్తున్నట్లు సమాచారం.కాగా.. 2022-2023 తర్వాత కంపెనీ చేపట్టిన అతిపెద్ద తొలగింపులు ఇవే కావడం గమనార్హం. 2022 చివర్లో 11 వేల మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. ఆ తర్వాతి ఏడాదే 10వేల మందిని విధుల్లో నుంచి తీసేసింది. మెటా (Meta) ప్రస్తుతం ఏఐ రంగంలో విస్తృతంగా పెట్టుబడులు పెడుతోంది. ఇందులోభాగంగా 2028 నాటికి డేటా సెంటర్ల ఏర్పాటుకోసం 600 బిలియన్ డాలర్లు వెచ్చించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కంపెనీ ఇటీవల వెల్లడించింది. ఈ క్రమంలో వ్యయ నియంత్రణ చర్యలు చేపడుతోంది.

---ఆ బ్యాంక్‌లో 15శాతం లేఆఫ్‌లు..మరోవైపు, బ్రిటన్‌కు చెందిన మల్టీనేషనల్ బ్యాంక్ స్టాండర్డ్ ఛార్టెర్డ్ పీఎల్‌సీ కూడా లేఆఫ్‌లు ప్రకటించింది. 2030 నాటికి సంస్థలో 15 శాతానికి పైగా ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించింది. వారి స్థానంలో ఏఐ ఏజెంట్లను వినియోగించనున్నట్లు తెలిపింది. అంటే దాదాపు 8వేల మందిపై ఈ తొలగింపుల ప్రభావం పడనుంది.

వాట్సప్‌లో ఇక EPFO సేవలు..

త్వరలోనే యూపీఐ విత్‌డ్రా సదుపాయం

దిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (EPFO) తన సేవలను సులభతరం చేయడంలో భాగంగా వాట్సప్‌ను వినియోగించుకోనుంది. ప్రావిడెంట్ ఫండ్ సంబంధిత సర్వీసుల కోసం త్వరలో వాట్సప్ సేవలను అందుబాటులోకి తేనుంది. దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వాట్సప్‌ను వినియోగిస్తున్న నేపథ్యంలో ఈ యాప్ ద్వారా కోట్లాదిమంది చందాదారులను చేరుకోవడం సులభతరం అవుతుందన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు.పీఎఫ్ బ్యాలెన్స్, చివరి ఐదు లావాదేవీలు, క్లెయిమ్ స్టేటస్ వంటి వివరాలు వాట్సప్ ద్వారా తెలుసుకోవచ్చు. గ్రీన్ టిక్ మార్క్ కలిగిన ఈపీఎఫ్ఓ వాట్సప్ నంబర్‌కు 'హలో' అని మెసేజ్ చేయడం ద్వారా ఈ సేవలు పొందొచ్చు. యూఏఎన్‌తో అనుసంధానం అయిన మొబైల్ నంబర్ ద్వారా ఈ సేవలు లభిస్తాయి. ఈపీఎఫ్ఓ నుంచి సందేశాలు సైతం స్థానిక భాషల్లో ఎప్పటికప్పుడు అందుకోవచ్చు.ఆటోమేటెడ్ సిస్టమ్స్ ద్వారా 24/7 వాట్సప్‌లో సేవలు లభిస్తాయని మంత్రి తెలిపారు. రాబోయే నెల రోజుల్లో ఈ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

--త్వరలోనే యూపీఐ ద్వారా విత్‌డ్రా....యూపీఐ ద్వారా పీఎఫ్ నిల్వలను విత్‌డ్రా చేసుకునే సదుపాయం కూడా త్వరలోనే అందుబాటులోకి రానుందని కేంద్రమంత్రి తెలిపారు. యూపీఐ పేమెంట్ గేట్‌వే ద్వారా ఈపీఎఫ్ నిధులను ఉపసంహరణ ప్రక్రియను విజయవంతంగా పరీక్షించినట్లు చెప్పారు. ఈ లావాదేవీలు నిర్వహించేందుకు యూపీఐ పిన్ అవసరం అవుతుందని, అలా విత్‌డ్రా అయిన మొత్తం బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. ఆపై ఏటీఎం లేదా యూపీఐ ద్వారా నగదును తమ అవసరాలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ సేవలు సజావుగా అందుబాటులోకి తెచ్చేందుకు సాఫ్ట్‌వేర్ లోపాలను తొలగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సేవలు అందుబాటులోకి వస్తే ఏడు కోట్ల మందికి ప్రయోజనం కలుగుతుందన్నారు.

తక్కువ ప్రీమియంతో రూ.2 లక్షల బీమా..

ఈ ప్రభుత్వ పథకాల్లో చేరారా?

అనుకోని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులకు ఆర్థికంగా అండగా నిలవడం బీమా ముఖ్య ఉద్దేశం. అలా అందరికీ అందుబాటు ధరలో బీమా సౌకర్యం కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రెండు పథకాలను తీసుకొచ్చింది. అవే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (PMJJBY), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (PMSBY). ఇందులో మొదటిది జీవిత బీమా కాగా.. సురక్ష బీమా యోజన ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తుంది. ఇటీవలే ఈ రెండు పథకాలు 11 ఏళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్నాయి. ఇప్పటికే ఈ పథకాల్లో చేరిన వారికి త్వరలో రెన్యువల్ కానున్నట్లు మొబైల్‌కు సందేశాలు వస్తున్నాయి. ఆటో డెబిట్ సమయంలో తగిన మొత్తం ఖాతాల్లో ఉంచాలి. లేదంటే బీమా ప్రయోజనం కోల్పోతారు. ఒకవేళ కొత్తగా చేరాలనుకుంటే ఎలా? ఈ పథకాల ప్రయోజనాలు ఏంటో చూద్దాం!

---ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన (PMJJBY)

18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తులు ఈ స్కీమ్‌లో చేరేందుకు అర్హులు.బ్యాంకు/పోస్టాఫీసులో పొదుపు ఖాతా ఉన్న వారెవరైనా చేరవచ్చు.ఒకటి కంటే ఎక్కువ పొదుపు ఖాతాలు ఉన్నా.. ఒక పొదుపు ఖాతా ఉన్న బ్యాంకు నుంచి మాత్రమే పథకానికి నమోదు చేసుకోవాలి.పాలసీదారుకు 55 సంవత్సరాల వరకు జీవిత బీమా పొందేందుకు వీలుంటుంది. పథకం కాలపరిమితి ఏడాది. జూన్ 1 నుంచి మే 31 వరకు అమల్లో ఉంటుంది.ఒకసారి ఇందులో చేరిన వారికి మే 2531 మధ్య ప్రీమియం మొత్తం ఆటో డెబిట్ ద్వారా రెన్యువల్ అవుతుంది.కొత్తగా ఈ పథకంలో చేరే వారికి జూన్ 1 నుంచి మే 31 వరకు కవరేజీ లభిస్తుంది.పాలసీదారుడు మరణిస్తే రూ.2 లక్షల హామీ మొత్తాన్ని నామినీకి అందజేస్తారు. మెచ్యూరిటీ ప్రయోజనాలు ఉండవు.ఒకవేళ డెబిట్ అయ్యే సమయంలో తగినంత బ్యాలెన్స్ ఖాతాలో లేనప్పుడు బీమా పాలసీ రద్దవుతుంది.ప్రీమియం ఎంత?: ఈ పథకాన్ని ప్రారంభించినప్పుడు కేవలం రూ.330తో ప్రీమియంతోనే పాలసీని అందించేవారు. ఇప్పుడు ఆ ప్రీమియంను రూ.436కు పెంచారు. ఆటోడెబిట్ ద్వారా బ్యాంకు/పోస్టాఫీసు ఖాతా నుంచి ఒకే వాయిదాలో ప్రీమియం మొత్తాన్ని చెల్లించాలి. పథకంలో చేరే నెలను అనుసరించి ప్రీమియం మారుతూ ఉంటుంది. జూన్ ఆగస్టు మధ్యలో చేరితే ఆ ఏడాదికి రూ.436, సెప్టెంబరునవంబరు మధ్య కాలంలో చేరితే రూ.342, డిసెంబరుఫిబ్రవరి మధ్య చేరితే రూ.228, అదే మార్చి మే మధ్య అయితే రూ. 114 ప్రీమియం చెల్లించాలి. ఈ పథకంలో జాయిన్ అయ్యేవారు ప్రీమియం మొత్తాన్ని ఏటా ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా తీసుకునేందుకు బ్యాంకులను అనుమతించాలి.

---ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన (PMSBY)

ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన (PMSBY) ప్రీమియం ఏడాదికి కేవలం రూ.20 మాత్రమే.18 నుంచి 70 సంవత్సరాల మధ్య వయసున్న వారు ఈ పథకంలో చేరొచ్చు. ఏదైనా బ్యాంకు/ పోస్టాఫీసులో పొదుపు ఖాతా ఉండాలి.ప్రతి సంవత్సరం జూన్ 1 నుంచి మే 31 వరకు ఈ బీమా అందుబాటులో ఉంటుంది. మే నెలాఖరులో ఆటో డెబిట్ అవుతుంది. చందాదారుడు ప్రమాదానికి గురై మరణించినా లేదా శాశ్వతంగా వైకల్యానికి గురైనా రూ.2 లక్షలు, పాక్షికంగా వైకల్యానికి గురైతే రూ.లక్ష పరిహారం లభిస్తుంది.చందాదారుడి వయసు 70 ఏళ్లు దాటినప్పుడు ఈ పథకం ఆటోమేటిక్‌గా రద్దు అవుతుంది.

రెండు పథకాల్లో చేరొచ్చా?

అతి తక్కువ ప్రీమియంతో లభించే ఈ రెండు పథకాల్లోనూ వ్యక్తులు చేరొచ్చు. రెండింటికీ కలిపి ఏడాదికి రూ.456 అవుతుంది. బ్యాంక్ లేదా పోస్టాఫీసులో పొదుపు ఖాతా ఉన్నవారు ఈ పథకాల్లో చేరొచ్చు. ఇంటర్నెట్/ మొబైల్ బ్యాంకింగ్ వాడేవారు యాప్/ వెబ్‌సైట్‌లో ఇన్సూరెన్స్ లేదా సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ విభాగంలోకి వెళితే PMSBY, PMJJBY పథకాలు కనిపిస్తాయి. వాటిని ఎంచుకున్నాక మీ వ్యక్తిగత, నామినీ వివరాలు నమోదు చేయాలి. ఆపై ఏటా ప్రీమియం డెబిట్ అయ్యేలా ఆటోడెబిట్ ఆప్షన్ టిక్ చేయాలి. ఆఫ్‌లైన్‌లో అయితే సంబంధిత బ్యాంకు/ పోస్టాఫీసు శాఖకు వెళ్లి సంబంధిత ఫారాలు నింపి ఇవ్వాల్సి ఉంటుంది. అక్కడా ఆటోడెబిట్‌కు ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది.

ఎయిర్‌టెల్ నుంచి 'ప్రయారిటీ పోస్ట్ పెయిడ్' సేవలు.. ఏంటి దీని ప్రత్యేకత?

ప్రముఖ టెలికాం సర్వీస్ ప్రొవైడర్ ఎయిర్‌టెల్ (Airtel) పోస్ట్ పెయిడ్ యూజర్ల కోసం కొత్త సర్వీసులను ప్రారంభించింది. 'ప్రయారిటీ పోస్ట్ పెయిడ్' పేరుతో కొత్త తరహా సేవలను అందుబాటులోకి తెచ్చింది. దీని కింద అంతరాయం లేని, నమ్మకమైన కనెక్టివిటీ లభిస్తుందని ఎయిర్‌టెల్ ఓ ప్రకటనలో పేర్కొంది. 5జీ నెట్‌వర్క్ స్లైసింగ్‌లో భాగంగా ఎయిర్‌టెల్ ఈ సేవలను లాంచ్ చేసింది. ఈ విధమైన సేవలను ప్రారంభించిన తొలి కంపెనీగా నిలిచింది.అన్ని పోస్ట్ పెయిడ్ ప్లాన్లకు ఎయిర్‌టెల్ ప్రయారిటీ సేవలు లభిస్తాయని ఎయిర్‌టెల్ తెలిపింది. ఇప్పటికే పోస్ట్ పెయిడ్ వినియోగిస్తున్న యూజర్లకు ఆటోమేటిక్‌గా ఈ సేవలు లభిస్తాయని పేర్కొంది. ప్రీపెయిడ్ కస్టమర్లు లేదా ఇతర నెట్‌వర్క్ కస్టమర్లు ఎయిర్‌టెల్ ప్రయారిటీ పోస్ట్ పెయిడ్ సేవలు పొందాలంటే ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్ లేదా ఎయిర్‌టెల్ స్టోర్‌లను సందర్శించాలని సూచించింది. అప్‌డేట్ చేసిన 5జీ స్మార్ట్‌ఫోన్ కస్టమర్లకు ఈ సేవలు లభిస్తాయని ఎయిర్‌టెల్ తెలిపింది. అప్‌గ్రేడ్స్ ఏవైనా పెండింగ్ ఉంటే ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్‌లో సెట్టింగ్స్ విభాగంలో చెక్ చేసుకోవచ్చని యూజర్లకు సూచించింది.

---రూ.449 నుంచి మొదలు.....రూ.449 ప్లాన్‌ల నుంచి మొదలయ్యే పోస్ట్ పెయిడ్ ప్లాన్లకు ఈ ప్రయారిటీ పోస్ట్ పెయిడ్ 5జీ సేవలు లభిస్తాయి. ఆయా ప్లాన్లలో అపరిమిత కాల్స్, డేటాతో పాటు 3000 ఎస్సెమ్మెస్‌లు, ఫ్రాడ్ డిటెక్షన్, స్పామ్ అలర్ట్‌లు లభిస్తాయి. దీంతో పాటు ఎయిర్‌టెల్ ఫాస్ట్‌లేన్ టెక్నాలజీ ద్వారా ప్రయారిటీ సేవలు అందుతాయి. అంటే 5G నెట్‌వర్క్ స్లైసింగ్‌ను ఉపయోగించి నెట్‌వర్క్ ట్రాఫిక్‌ను నిర్దిష్ట లేన్‌లుగా విభజిస్తారు. దీనివల్ల పోస్ట్ పెయిడ్ వినియోగదారులకు ప్రత్యేకమైన, ప్రాధాన్యం కలిగిన బ్యాండ్‌విడ్త్ లభిస్తుంది. దీంతో నెట్‌వర్క్ రద్దీగా ఉన్న సమయాల్లోనూ టెలికాం సేవలు స్థిరంగా కొనసాగుతాయి. రద్దీ ప్రాంతాల్లో అదే నెట్‌వర్క్ వాడుతున్నవారు అంతరాయాలు ఎదుర్కొంటే.. ప్రయారిటీ ప్లాన్ యూజర్లకు ఇలాంటి అవాంతరాలు ఎదురుకావన్నమాట.

లుక్కు... క్లిక్కు!

కథానాయకుడు నందమూరి బాలకృష్ణ.. దర్శకుడు కొరటాల శివ కలయికలో కొత్త చిత్రం పట్టాలెక్కనుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా బాలకృష్ణ లుక్ టెస్ట్‌ని పూర్తి చేసినట్లు సమాచారం. దీంట్లో ఆయన పాత్రని కొరటాల చాలా శక్తిమంతమైన రీతిలో డిజైన్ చేసినట్లు తెలిసింది. దీనికి తగ్గట్లే తన లుక్ కూడా మునుపెన్నడూ చూడని విధంగా సరికొత్తగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. బలమైన సామాజిక సందేశమున్న యాక్షన్ కథతో ఈ సినిమా ముస్తాబు కానుంది. రాజకీయ అంశాలకు ఎంతో ప్రాధాన్యత ఉండనుంది. జూన్ 10న బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా

పొరపాటున కూడా నా కలలోకి రావొద్దు...

"దేవుడు నాకొక గొప్ప వరం ఇచ్చాడు... ట్రిగ్గర్ నొక్కగానే మరిచిపోవడం. నిదరపోయినప్పుడు నా కల్లోకి నేను చంపినవాళ్ల ముఖాలు రావు, మిగిలివున్న శత్రువుల ముఖాలే కనపడతాయి. పొరపాటున కూడా నా కల్లోకి రావొద్దు....' అంటున్నాడు 'డ్రాగన్' అవతారంలో ఎన్టీఆర్. డ్రాగన్ కథేమిటో తెలియాలంటే వచ్చే ఏడాది వరకూ ఎదురు చూడాల్సిందే. ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రమే 'డ్రాగన్'. మైత్రీ మూవీ మేకర్స్, నందమూరి తారక రామారావు ఆర్ట్స్, టీ సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు రూపొందిస్తున్నాయి. నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, కొసరాజు హరికృష్ణ నిర్మాతలు. ఎన్టీఆర్ పుట్టినరోజని పురస్కరించుకుని మంగళవారం రాత్రి గ్లింప్స్‌ని విడుదల చేస్తూ పేరుని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. "బ్రిటిష్ వాళ్లు భారతదేశానికి కాటన్, స్టీల్, స్పైసెస్ కోసం వచ్చారు. కానీ 250 ఏళ్లు వాళ్లు ఇక్కడే ఉండిపోవడానికి కారణం... ఒక మొక్క. ప్రపంచంలోనే అత్యంత వ్యసనకారక పదార్థమైన హెరాయిన్‌ని తయారు చేసే ఆ మొక్క... ఓపియమ్ పాపి' అంటూ మొదలైన గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని రేకెత్తించింది. ఈ మొక్క హెరాయిన్ కంటే ఎక్కువ విలన్‌నే తయారు చేసిందని, విలన్ల కథే అని టీజర్ చాటుతోంది. ఎన్టీఆర్ డ్రాగన్‌గా రక్తపాతం సృష్టించే శక్తిమంతమైన పాత్రలో కనిపించారు. విజువల్స్ ప్రత్యేకమైన కథా ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నాయి. 'కె.జి.ఎఫ్' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని అలరించిన దర్శకుడు ప్రశాంత్‌నీల్ 'సలార్' తర్వాత తెరకెక్కిస్తున్న సినిమా ఇది. ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్.

కేన్స్ లో మెరిసిన జాక్వెలిన్

ప్రత్యేక గీతాల్లో స్టెప్పులు... వైవిధ్యమైన పాత్రల్లో గ్లామర్‌కు నటనను జోడించి కనిపిస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తుంటుంది అందాల తార జాక్వెలిన్ ఫెర్నాండెజ్. సినీ పరిశ్రమ, ఫ్యాషన్ రంగం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే కేన్స్ చిత్రోత్సవాల్లో తాజాగా సందడి చేసిందీ భామ. ఈ వేడుకలో ఇప్పటికే పలువురు భారతీయ తారలు మెరిశారు. ఇందులో భాగంగానే ఇప్పుడు కేన్స్‌లో విశిష్టమైన 'ది మిరాకిల్స్ గాలా'కు ప్రపంచ ప్రసిద్ధ తారలతోపాటు ఈ ఏడాది భారతీయ సెలబ్రిటీగా జాక్వెలిన్ హాజరైంది. సొగసైన నల్లటి మినీ డ్రెస్‌ను ధరించి వేడుకలో అడుగుపెట్టిన ఆమె రెడ్‌కార్పెట్‌పై హొయలొలికించింది. క్లాసిక్ హాలీవుడ్ గ్లామర్ లుక్‌ని అలవోకగా ప్రదిరిస్తూ సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంగా ఇన్‌స్టాలో జాక్వెలిన్.. "కేన్స్‌లో మిరాకిల్ షో కోసం" అనే క్యాప్షన్‌తో ఫొటోలను పంచుకుంది. జాక్వెలిన్ తదుపరి హీరో అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'వెల్కమ్ టు ది జంగిల్' సినిమాలో కనిపించనుంది.

పంచ్‌తో 'వైబ్' గ్యారంటీ

అందం.. అభినయంతో అలరించే సొట్టబుగ్గల సుందరి ప్రీతి జింటా తెరపై కనిపించి చాలా ఏళ్లయ్యింది. ఇన్నేళ్ల తర్వాత 'వైబ్' అనే చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నట్లు ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని సామాజిక మాధ్యమాల వేదికగా అధికారికంగా పంచుకుంది. "పంచ్.. పంచ్‌లైన్ రెండూ వైబ్‌తో గ్యారంటీ' అనే వ్యాఖ్యల్ని పేర్కొంటూ.. ఈ సినిమా సెప్టెంబరు 18న థియేటర్లలో విడుదల కానుందని తెలిపింది. ఈ మేరకు చిత్రబృం-దంతో కలిసి ఓ పోస్టర్‌ని ఆవిష్కరించింది. ఈ సినిమాని హిందీ నటుడు కునాల్ కెమ్ము తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఆయన, ప్రీతి, స్పర్శ్ శ్రీవాస్తవ, వాన్సిక ధిర్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు.

ముందు ఆర్థిక స్వేచ్ఛ.. తర్వాతే పెళ్లి

మహిళలు ఎవరిని పెళ్లి చేసుకుంటారనే దానికంటే.. మీరు ఏం చేస్తారు, మీరు ఎవరనేదే ముఖ్యం అంటున్నారు బాలీవుడ్ కథానాయిక కంగనా. వివాహిత మహిళలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై ఆమె తాజాగా ఇన్‌స్టా స్టోరీలో ఒక నోట్ పంచుకున్నారు. ఇందులో యువతులు వివాహ బంధంలోకి అడుగుపెట్టే ముందు ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు తమ కెరీర్‌ను నిర్మించుకోవడంపై దృష్టి పెట్టాలని తెలిపారు. "రోజూ పెళ్లి అయిన యువతుల గురించి ఎన్నో విషాద వార్తలు వస్తున్నాయి. చదువుకున్న యువతులలో చాలా మంది ఆ విషాదం ఎదురుకాకముందే.. తమని ఉక్కిరిబిక్కిరి చేసే పరిస్థితుల నుంచి బయటపడేయమని తమ తల్లిదండ్రులను వేడుకుంటున్నారు. కానీ, భారతీయ సమాజం కూతుళ్లకు పెళ్లయ్యాక వారిని వదిలేస్తుంది. మీ జీవితంలో మరెవరోకన్నా మీ కెరీరే మీకు ముఖ్యం. మీరు ఆర్థికంగా స్వేచ్ఛగా ఉన్న తర్వాతే పెళ్లి గురించి ఆలోచించండి. దయచేసి, మీ జీవితానికి మీరే హీరో అయి ఉండండి. మిమ్మల్ని కాపాడటానికి ఎవరూ రారు. మీరు ఎవరిని పెళ్లి చేసుకుంటారనే దానికంటే మీరు ఏం చేస్తున్నారు, ఎవరు అనేదే ముఖ్యం. మీకు కావాల్సిన జీవితాన్ని మీరే నిర్మించుకోండి. ఎవరి మాటా వినకండి" అని కంగనా ఆ నోట్‌లో పేర్కొన్నారు. ఉత్తరాదిలో ఇటీవల జరిగిన వివాహిత మహిళల ఆత్మహత్యల నేపథ్యంలో కంగనా ఈ పోస్ట్ పెట్టినట్లు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది. కంగనా నటిస్తున్న 'భారత భాగ్య విధాత' వచ్చే నెల 12న విడుదల కానుంది.

నీ ప్రేమలో మరణానికైనా సిద్ధమే

'నా మనసుకి ఏమయిందో.. ఏం చేయను.. నీ ప్రేమలో మరణానికైనా సిద్ధమే' అంటూ తన ప్రేయసి కోసం పాటలు పాడుతున్నాడు ప్రియుడు కునాల్ పాత్రలో బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్. ఆయన.. కృతి సనన్, రష్మిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కాక్‌టెయిల్ 2'. దర్శకుడు హోమి అడజానియా తెరకెక్కించారు. మడాక్ ఫిల్మ్స్ రూపొందించిన ఈ సినిమా జూన్ 19న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ప్రచారంలో భాగంగా తాజాగా 'మషూక' అనే గీతాన్ని సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది చిత్రబృందం. 'ఎందుకో తెలీదు.. ఇష్టం లేని వారి నుంచి నన్ను కాపాడుకునేందుకు నిన్నే కోరుకున్నా..'అంటూ సాగే ఈ పాట షాహిద్, కృతిల మధ్య కెమిస్ట్రీతో ప్రేమ గీతంగా అనిపించినా.. చివరిలో రష్మిక ఎంట్రీతో స్నేహం కలగలసిన పాటగా ఆకట్టుకునేలా ఉంది.



ఐపీఎల్ డబ్బు, కీర్తి తాత్కాలికం

బెంగళూరు: ఐపీఎల్ అందించే తక్షణ గుర్తింపు ఆకర్షణకు అతీతంగా ఎదగాలని యువ ఆటగాళ్లకు భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సూచించాడు. క్రికెట్ పట్ల అంకితభావంతో కనీసం 10-15 ఏళ్ల పాటు కొనసాగాలని తెలిపాడు. ప్రపంచ క్రికెట్లో నిజమైన గౌరవం పొందాలంటే కేవలం మెరుపు ఇన్నింగ్స్‌లు సరిపోవని.. అన్ని ఫార్మాట్లలో రాణించే ప్రేరణ కలిగి ఉండాలని కోహ్లి స్పష్టంచేశాడు. "ఈ రోజుల్లో చాలామంది పట్టుదలను డబ్బుతో ముడిపెడుతున్నారు. అదొక పెద్ద కారణం. 20 బంతుల్లో 40-50 పరుగులు చేసి పేరు ప్రఖ్యాతలు సంపాదించడం.. ప్రచారం పొందడం.. కీర్తిని సంపాదించడం.. ఐపీఎల్ ద్వారా లభించే ఆదాయం లాంటివి ఒకే ఫార్మాట్లో దొరికినప్పుడు అది ఆటగాళ్లను ఒక సౌకర్యవంతమైన స్థితిలోకి నెట్టేస్తాయి. కానీ అది సుదీర్ఘ కెరీర్‌కు ఆటంకం కావొచ్చు. టీ20 క్రికెట్ బాగుంది.. ఎక్కువసేపు ఒత్తిడిని తట్టుకోవాల్సిన అవసరం లేదు.. మైదానంలోకి వెళ్లి బంతిని బాదొచ్చు అని ఎవరైనా అనుకోవచ్చు. లేదా 15-20 ఏళ్లు క్రికెట్ ఆడాలని.. క్రికెట్ ప్రపంచం, అభిమాన ఆటగాళ్ల నుంచి గుర్తింపు, గౌరవం పొందాలని అనుకోవచ్చు. అది భిన్నమైన మార్గం. దానికి ఎంతో పట్టుదల అవసరం. రాబోయే పదేళ్ల పాటు ఆటకే అంకితమవుతా.. అది ఎంత కష్టమైనా సరే నేను సిద్ధం అని చెప్పే మనస్తత్వం ఉండాలి. ఈతరం ఆటగాళ్ల పవర్ హిట్టింగ్ సామర్థ్యం అద్భుతం. నేను నేర్చుకోని ఎన్నో షాట్లు ఆడగలిగే ఆటగాళ్లు వస్తున్నారు. పవర్ హిట్టింగ్, విధ్వంసకర క్రికెట్ విషయంలో వీళ్లు చాలా ముందున్నారు. అయితే ఐపీఎల్ ఆరో వారం వరకు పిచ్‌లు మందకొడిగా మారతాయి. అప్పుడు ఆటగాళ్ల నైపుణ్యానికి అసలైన పరీక్ష ఎదురవుతుంది. ఆ సమయంలో 250-260 స్కోర్లు రావు. 175 లేదా 180 పరుగుల లక్ష్య ఛేదనే ఆటగాడి నైపుణ్యానికి నిదర్శనం" అని కోహ్లి వివరించాడు. 2022లో భారత సారథ్యం నుంచి వైదొలిగిన తర్వాత బాధాకర దశను ఎదుర్కొన్నట్లు కోహ్లి చెప్పాడు. "కెప్టెన్సీ వదిలేసిన తర్వాత రాహుల్ ద్రవిడ్, విక్రమ్ రాఠోడ్‌లతో మాట్లాడా. చాలా విషయాలు పంచుకున్నా. వారిద్దరు అప్పటి వరకు నేనేం సాధించానో అర్థమయ్యేలా చేశారు. వారి కోసం ఆడాలనిపించింది. 2023లో నా టెస్టు క్రికెట్ ప్రయాణం అద్భుతంగా సాగింది. వారిని కలిసినప్పుడల్లా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతా" అని కోహ్లి పేర్కొన్నాడు.

వైభవ్ వీరకొట్టుడు

చిన్నోడు మళ్లీ చితక్కొట్టేశాడు. నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. సిక్స్‌లు, ఫోర్ల మోతతో వైభవ్ పెను విధ్వంసం సృష్టించిన వేళ.. రాజస్థాన్ మళ్లీ గాడి నపడింది. హ్యాట్రిక్ పరాభవాల నుంచి తేరుకున్న రాయల్స్.. ఏడో విజయంతో చిట్టచివరి ప్లేఆఫ్స్ బెర్తు రేసులో మిగతా జట్ల కన్నా ముందు నిలిచింది. వైభవ్ వీరవిహారంతో 221 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి, పాయింట్ల పట్టికలో నాలుగో స్థానానికి దూసుకెళ్లింది. 13 మ్యాచ్‌ల నుంచి 14 పాయింట్లు సంపాదించిన రాజస్థాన్, ఇక తన చివరి మ్యాచ్‌లో గెలిస్తే చాలు.. సమీకరణాలతో సంబంధం లేకుండా ముందంజ వేస్తుంది.

ప్లేఆఫ్స్ రేసులో రాజస్థాన్ రాయల్స్‌కు అత్యంత కీలక విజయం. వైభవ్ సూర్యవంశీ (93; 38 బంతుల్లో 7×4, 10×6) హీరోచిత ఇన్నింగ్స్‌తో మంగళవారం రాయల్స్ 7 వికెట్ల తేడాతో లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్‌ను ఓడించింది. మిచెల్ మార్ష్ (96; 57 బంతుల్లో 11×4, 5×6), ఇంగ్లిస్ (60; 29 బంతుల్లో 7×4, 3×6)ల విధ్వంసంతో మొదట లఖ్‌నవూ 5 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. వైభవ్‌తో పాటు ధ్రువ్ జురెల్ (53 నాటౌట్; 38 బంతుల్లో 3×4, 3×6), యశస్వి జైస్వాల్ (43; 23 బంతుల్లో 8×4, 1×6) మెరవడంతో లక్ష్యాన్ని రాజస్థాన్ 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. పరాగ్ గాయంతో దూరం కావడంతో ఈ మ్యాచ్‌లో రాజస్థాన్‌కు జైస్వాల్ నాయకత్వం వహించాడు.

వైభవ్ మెరుపులా..: రాజస్థాన్ ఛేదనలో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆటే హైలైట్. ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచిన అతడు.. కళ్లు చెదిరే స్ట్రోక్‌ప్లేతో ఆ జట్టు విజయంలో అత్యంత కీలక పాత్ర పోషించాడు. ఫోర్లు, సిక్స్‌లతోనే అతడు 88 పరుగులు చేయడం విశేషం. రాజస్థాన్‌కు చాలా ముఖ్యమైన ఈ మ్యాచ్‌లో వైభవ్ ఎప్పటిలాగే చెలరేగినా... సహనం కూడా పాటించాడు. ఛేదనలో మొదట్లో జైస్వాల్ చకచకా బౌండరీలు బాదేశాడు. వైభవ్ తాను ఎదుర్కొన్న తొలి పది బంతుల్లో అయిదు పరుగులే చేశాడు. కానీ క్రమంగా జోరందుకున్నాడు. మయాంక్ బౌలింగ్‌లో సిక్స్‌తో గేర్ మార్చిన అతడు.. జైస్వాల్ నిష్క్రమించినా, దూకుడు కొనసాగించాడు. ఆకాశ్ ఓవర్లో రెండు సిక్స్‌లు, మూడు ఫోర్లతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో 23 బంతుల్లోనే అర్ధశతకాన్ని అందుకున్నాడు. 10 ఓవర్లలో 121/1తో రాజస్థాన్ తిరుగులేని స్థితిలో నిలిచింది. ఏమాత్రం తగ్గని వైభవ్.. ప్రిన్స్ యాదవ్ ఓవర్లో వరుసగా రెండు సిక్స్‌లతో చెలరేగాడు. మరోవైపు నెమ్మదిగా మొదలెట్టిన జురెల్.. క్రమంగా జోరందుకున్నాడు. అతడు రెండు సిక్స్‌లు, ఫోర్.. వైభవ్ రెండు సిక్స్‌లు బాదడంతో 12వ ఓవర్లో మయాంక్ యాదవ్ ఏకంగా 29 పరుగులు సమర్పించుకున్నాడు. 12 ఓవర్లలో 166/1తో రాజస్థాన్ లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. ఆఖరి ఎనిమిది ఓవర్లలో కేవలం 55 పరుగులు చేయాల్సిన స్థితిలో ఆ జట్టు సమీకరణం తేలికైపోయింది. కానీ అలవోకగా సెంచరీ పూర్తి చేసేలా కనిపించిన వైభవ్.. ఓ భారీ షాట్‌కు యత్నించి ఔటయ్యాడు. ఆ తర్వాత స్కోరు వేగం మందగించింది. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన లఖ్‌నవూ.. రాజస్థాన్‌పై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేసింది. అయితే జురెల్ ప్రశాంతంగా బ్యాటింగ్ చేశాడు. ఆఖరి రెండు ఓవర్లలో రాయల్స్‌కు 10 పరుగులు అవసరమయ్యాయి. జురెల్ ఎలాంటి నాటకీయతకు అవకాశం లేకుండా.. ఫెరీరా (16 నాటౌట్)తో కలిసి జట్టును విజయతీరాలకు చేర్చాడు.

మార్ష్ ధనాధన్: అంతకుముందు లఖ్‌నవూ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. స్కోరు ఎనిమిదో ఓవర్లోనే 100 దాటింది. ఓపెనర్లు మిచెల్ మార్ష్, జోష్ ఇంగ్లిస్ విధ్వంసక బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఇద్దరూ పోటీపడుతూ ఫోర్లు, సిక్స్‌ల మోత మోగించారు. ఆర్చర్ వేసిన ఇన్నింగ్స్ మొదటి ఓవర్లో వరుసగా 4, 6తో మొదలెట్టిన మార్ష్, ఆ తర్వాత ఏమాత్రం తగ్గలేదు. ఇంగ్లిస్ కూడా స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించాడు. ఆర్చర్, సందీప్ శర్మ, బ్రిజేశ్.. బ్యాటర్లను కట్టడి చేయలేకపోయారు. ఇంగ్లిస్ 23 బంతుల్లోనే అర్ధశతకం సాధించాడు. 9వ ఓవర్లో అతడు నిష్క్రమించినా.. మార్ష్ జోరు కొనసాగించాడు. 25 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసిన అతడు.. కళ్లు చెదిరే షాట్లతో అలరించాడు. ఏమాత్రం అవకాశమున్నా బంతిని బలంగా బాదుతూ బౌండరీ దాటించాడు. ఇంగ్లిస్ స్థానంలో క్రీజులోకి వచ్చిన పూరన్ (16) మాత్రం సాధికారికంగా ఆడలేకపోయాడు. ఈ సీజన్‌లో పెద్దగా ఫామ్‌లో లేని అతడు, మరోసారి స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. 13వ ఓవర్లో అతడు నిష్క్రమించేటప్పటికి లఖ్‌నవూ స్కోరు 151. పుంజా అతణ్ని ఔట్ చేశాడు. పుంజాతో పాటు బ్రిజేశ్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో స్కోరు వేగం కాస్త తగ్గింది. అయితే పంత్ (35; 23 బంతుల్లో 2×4, 2×6) నెమ్మదిగా మొదలెట్టినా కొన్ని చక్కని షాట్లు ఆడాడు. మరోవైపు మార్ష్ జోరు కొనసాగించినా.. లఖ్‌నవూ అనుకున్న స్థాయిలో మాత్రం ఇన్నింగ్స్‌ను ముగించలేకపోయింది. ఆఖరి నాలుగు ఓవర్లలో ఆ జట్టు 3 వికెట్లు కోల్పోయి 38 పరుగులే చేసింది.

12 ఓవర్లలో 149/1తో 250 స్కోరు చేసేలా కనిపించిన లఖ్‌నవూ.. 220తో సరిపెట్టుకుంది. ఆ జట్టు చివరి ఓవర్లో మూడు వికెట్లు చేజార్చుకుని 5 పరుగులే చేసింది. మార్ష్ శతకానికి కొద్ది దూరంలో ఔటయ్యాడు.

స్కోరు వివరాలు

లఖ్‌నవూ ఇన్నింగ్స్: మిచెల్ మార్ష్ రనౌట్ 96; ఇంగ్లిస్ (బ) యశ్‌రాజ్ పుంజా 60; పూరన్ (సి) ఫెరీరా (బ) యశ్‌రాజ్ పుంజా 16; పంత్ రనౌట్ 35; సమద్ నాటౌట్ 0; బదోని (బ) ఆర్చర్ 0; ఎక్స్‌ట్రాలు 13 మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) 220; వికెట్ల పతనం: 1-109, 2-151, 3-215, 4-220, 5-220; బౌలింగ్: ఆర్చర్ 4-0-39-1; సుశాంత్ మిశ్రా 4-0-46-0; సందీప్ శర్మ 3-0-43-0; బ్రిజేశ్ 4-0-44-0; యశ్‌రాజ్ పుంజా 4-0-35-2; శానక 1-0-10-0

రాజస్థాన్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) పంత్ (బ) ఆకాశ్ 43; సూర్యవంశీ (సి) సమద్ (బ) మోసిన్ 93; జురెల్ నాటౌట్ 53; డ్రె ప్రిటోరియస్ రనౌట్ (బదోని) 7; ఫెరీరా నాటౌట్ 16; ఎక్స్‌ట్రాలు 13, మొత్తం: (19.1 ఓవర్లలో 3 వికెట్లకు) 225; వికెట్ల పతనం: 1-75, 2-180, 3-196; బౌలింగ్: ఆకాశ్ 3-0-54-1; మోసిన్ 4-0-31-1; మయాంక్ 4-0-50-0; ప్రిన్స్ 4-0-43-0; దిగ్వేశ్ 4-0-38-0; షాబాజ్ 0.1-0-6-0

రొనాల్డో ఆరోసారి..



లిస్బన్: కెరీర్‌లో ఎన్నో ఘనతలు సాధించినా.. పోర్చుగల్ స్టార్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో ప్రపంచకప్‌ను ఇప్పటిదాకా ముద్దాడలేకపోయాడు. కప్పు లక్ష్యంతో రొనాల్డో ఆరోసారి బరిలో దిగుతున్నాడు. జూన్ 11న ఆరంభమయ్యే ఈ మెగా టోర్నీలో పాల్గొనే పోర్చుగల్ జట్టుకు 41 ఏళ్ల రొనాల్డో సారథ్యం వహించనున్నాడు. అతడికి ఇదే దాదాపు చివరి ప్రపంచకప్. ఇప్పటిదాకా రికార్డు స్థాయిలో 143 అంతర్జాతీయ గోల్స్ కొట్టిన రొనాల్డో.. ఈసారి టోర్నీలో ఎలా ఆడతాడనేది ఆసక్తికరం. ఆరు ప్రపంచకప్‌లు ఆడిన ఆటగాడిగా రికార్డు సాధించే అవకాశం అతడికి ఉంది. ఇప్పటివరకు ఆ ఘనత ఎవరూ సాధించలేదు. అర్జెంటీనా దిగ్గజం మెస్సి, మెక్సికో గోల్‌కీపర్ గులిర్మో ఒచావో కూడా ఆరో ప్రపంచకప్ ఆడటం లాంఛనమే.

బ్రెజిల్ జట్టులో నెయ్‌మార్

రియోడిజనీరో: ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో బరిలో దిగే బ్రెజిల్ జట్టులో స్టార్ స్ట్రైకర్ నెయ్‌మార్‌కు చోటు దక్కింది. 34 ఏళ్ల నెయ్‌మార్ ఫిట్‌నెస్‌పై అనుమానాలు ఉన్నా.. సెలక్టర్లు అతడిని ఎంపిక చేశారు. 2023 అక్టోబర్‌లో మోకాలికి గాయం కావడంతో నెయ్‌మార్ జట్టుకు దూరమయ్యాడు. డిఫెండర్ మార్కినోస్ బ్రెజిల్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

సీఎస్కేకు ఇంకా ప్లే ఆఫ్స్ ఛాన్స్ లు..

సమీకరణాలు ఇలా

ఐపీఎల్ 2026 ఆఖరి అంకానికి చేరుకుంటోంది. ఇప్పటికే ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్‌స్‌నకు అర్హత సాధించాయి. మిగిలిన ఒక్క బెర్తు కోసం అయిదు జట్లు పోటీపడుతుండటంతో ఉత్కంఠ తప్పేలా లేదు. సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓటమిపాలైన చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఇంకా ఒకే ఒక్క మ్యాచ్ ఆడాల్సి ఉన్న సీఎస్కే ప్లే ఆఫ్స్ బెర్తు దక్కించుకోవాలంటే ఎలాంటి సమీకరణాలు అవసరమో ఓ లుక్కేద్దాం.

ఇప్పటివరకు చెన్నై 13 మ్యాచ్‌లు ఆడి 12 పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. మే 21న గుజరాత్ టైటాన్స్‌తో చివరి మ్యాచ్ ఆడాల్సి ఉంది.

సీఎస్కే ముందంజ వేయాలంటే తొలుత తమ చివరి లీగ్ మ్యాచ్‌లో కచ్చితంగా భారీ తేడాతో గెలవాలి. అప్పుడే నెట్‌రన్‌రేట్ మెరుగవుతుంది. ఒకవేళ ఓడిపోతే టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

గుజరాత్‌పై భారీ విజయం సాధిస్తే 14 పాయింట్లతో చెన్నై ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంటాయి. అప్పుడు ఇతర జట్ల ఫలితాల కోసం ఎదురుచూడాలి.

ఈ క్రమంలో తొలుత పంజాబ్ కింగ్స్ నుంచి సీఎస్కేకు ముప్పు పొంచి ఉంది. మే 23న లఖ్‌నవూతో జరిగే తమ చివరి లీగ్ మ్యాచ్‌లో పంజాబ్ ఓడిపోతే ఆ జట్టు 13 పాయింట్లతో ఎలిమినేట్ అవుతుంది.

ప్రస్తుతం 12 పాయింట్స్‌తో ఉన్న రాజస్థాన్, 11 పాయింట్లతో ఉన్న కేకేఆర్ తమ మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో కనీసం ఒక మ్యాచ్‌లో ఓడిపోవాలి. అప్పుడు సీఎస్కేకు ఛాన్స్‌లు పెరుగుతాయి.

13 మ్యాచ్‌లు ఆడి 12 పాయింట్లతో ఉన్న దిల్లీ క్యాపిటల్స్.. చివరి మ్యాచ్ కేకేఆర్‌తో ఆడనుంది. ఆ మ్యాచ్‌లో కోల్‌కతా గెలిస్తే దిల్లీ ముప్పు చెన్నైకి తప్పుతుంది. ఒకవేళ దిల్లీ విజయం సాధించినా భారీ తేడాతో గెలవకూడదు.

పంత్‌పై వేటు

ఊహించిందే జరిగింది. పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న వికెట్‌కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్.. వన్డే జట్టు నుంచి ఉద్వాసనకు గురయ్యాడు. టెస్టు వైస్ కెప్టెన్సీని కూడా కోల్పోయాడు. అజిత్ అగార్కర్ నేతృత్వంలో సెలక్షన్ కమిటీ అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టు, మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం మంగళవారం భారత జట్లను ప్రకటించింది. వైస్‌కెప్టెన్‌గా పంత్‌ను తప్పించి ఆ బాధ్యతలను కేఎల్ రాహుల్‌కు అప్పగించింది. "పంత్ వన్డే జట్టులో భాగం కాదు. అతడు మంచి టెస్టు ప్లేయర్ కావాలని కోరుకుంటున్నాం. అతడెప్పుడూ మంచి ప్లేయరే. టెస్టు జట్టులో అతడి స్థానానికి ఎలాంటి ఇబ్బందీ లేదు. లైనప్‌లో అతడు ప్రధాన బ్యాటర్. ప్రస్తుతానికి వన్డేలు, టెస్టులకు వేరు వేరు వికెట్‌కీపర్లను ఎంపిక చేశాం" అని అగార్కర్ చెప్పాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో బ్యాటర్‌గా విఫలమైన పంత్.. కెప్టెన్‌గానూ ఆకట్టుకోలేకపోతున్న సంగతి తెలిసిందే.